
J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS



# లాయర్

సంపుటి : 45 సంచిక : 1 06.06.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# మనకూ కావాలి ఓ కుటుంబం



*రక్తసంబంధం.. బాధల్లో బాసటగా.. ఆనందాల్లో ఆత్మీయంగా ఉంటూ నిత్యం వెన్నుతట్టి దన్నుగా నిలుస్తుంది. కష్టం వచ్చినప్పుడు తోడుగా.. నష్టం వచ్చినప్పుడు నేనున్నానంటూ భరోసానిస్తుంది. ఈ బంధం.. అనుబంధమై కలకాలం నిలిస్తే అదే అందమైన అపురూప కుటుంబం. ఎవరికి ఎంతమంది శ్రేయోభిలాషులు, స్నేహితులున్నా.. నా అన్న వారి ప్రోత్సాహం ఎప్పుడూ కొండంత బలాన్నిస్తుందనడంలో సందేహం లేదు. అయిన వారు ఆదరిస్తే.. ఆత్మీయంగా చేరదీస్తే ఆ అనుభూతే వేరు. వేడుకేదైనా బలం..బలగం ఉంటేనే గుర్తింపు. అయితే మారుతున్న సమాజం.. ఉరుగుల పరుగుల జీవితాల్లో కుటుంబం కొత్తరూపును సంతరించుకుంటోంది. బంధం కొత్త అర్థాలను వెతుకుతోంది. మనది.. మనకు అనే భావన కంటే నాది.. నేనే అనే ధోరణికి బీజం వేస్తోంది. దీనికి ఆదిలోనే చెక్ చెప్పాలంటే మనందరికీ కావాలి ఓ మంచి కుటుంబం. ఇది బుల్లి ఆర్థికవేత్తలను తయారు చేసే కర్మాగారం కావాలి.. సంస్కారం నేర్పే శిక్షణా కేంద్రం అవ్వాలి.. శరీరక మానసిక రుగ్మతలను తగ్గించే వైద్యశాల కావాలి. అప్పుడే భావిభారతం సస్యశ్యామలమై, సంపద విరాజిల్లి దినదిన ప్రవర్థమానంగా వర్ధిల్లుతుంది.*

## కుటుంబం.. సంస్కారం నేర్పే పాఠశాల కావాలి..

చిన్నా..పెద్ద.. గురువు.. దైవం.. అయినవారు అంటే ఎవరు..? ఆత్మీయులు అంటే ఎవరు? వారిని ఎలా ట్రీట్ చేయాలో తెలియజెప్పే గురువులేని పాఠశాల కుటుంబం. గతంలో మనదేశం ఉమ్మడి కుటుంబాలకు నిలయం. అవ్వా..తాత, అత్తామామ, తల్లీతండ్రి, బాబాయ్.. పిన్ని అంటూ అందరు కలిసికట్టుగా ఉండేవారు. పండుగలు.. పబ్బాలే కాదు.. విందు వినోదకార్యక్రమాలు.. శుభ అశుభ కార్యాక్రమాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచేవారు. ఈ క్రమంలో ఎవరితో ఎలా ప్రవర్తించాలో.. ఎవరిని ఎంత వరకు గౌరవించాలో.. ఇంటి బాధ్యతలను ఎలా సమన్వయం చేసుకోవాలో పిల్లలకు దగ్గరుండి తెలియజేసేవారు. ఫలితంగా పిల్లల్లో కలుపుగోలుతనం, జాలి, దయ, కరుణ వంటి సుగుణాలు పెంపొందేవి. మానవత్వం, సోదర భావం వంటి లక్షణాలు అలవడేవి. కానీ మారుతున్న కాలం.. మారిన అవసరాలు.. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కారణంగా చిన్నకుటుంబం అనే భావన క్రమంగా దేశంలో పురుడుపోసుకుంది. అయితే, ఆ ధోరణి విపరీతమై చివరికి మనది.. మనం అనే భావన కనుమరుగై నాది.. నేను.. అనే భావన పెరిగిపోతోంది. ఫలితంగా తమకన్నా పెద్దవారితో ఎలా మసలు కోవాలో పిల్లలు గుర్తించలేకపోతున్నారు. ఇతరులపై కనీస దయ చూపలేకపోతున్నారు. ముఖ్యంగా వయోభేదం కూడా చూడకుండా మహిళలపట్ల కొందరు విపరీత మనస్తత్వంతో అకృత్యాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో దాడులకూ వెనుకాడడం లేదు. ఇటీవల అన్నమయ్య జిల్లాలో ప్రేమికులరోజే ఓ బాలికపై ఓ ఉన్మాది యాసిడ్ దాడికి పాల్పడం ఇందుకు నిదర్శనం.

> కుటుంబం ఎంత పెద్దదనేది ముఖ్యం కాదు.. అందులో ఎంత ప్రేముందనేదే ముఖ్యం!
> - పీటర్ బఫెట్

## ఇలా చేస్తే నీతిమంతుల నిలయమే..

చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు విద్యతో పాటూ తమ బిడ్డలకు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలి. గొప్పవ్యక్తుల జీవితానుభవాలను, వారి ఎదుగుదలపై అవగాహన కల్పించాలి. ముఖ్యంగా అందరితో కలిసిపోయే మనస్తత్వం పెంపొందించాలి. ఇతర అభిప్రాయలను గౌరవించి.. తదనుగుణంగా వ్యవహరించే నేర్పును ప్రోత్సహించాలి. సమాజంలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని.. సంపద, కులం, మతం వంటివి మనిషి అభివృద్ధికి అడ్డుకాకూడదని తెలియజెప్పాలి. మంచికి అభినందన.. తప్పునకు దండన ఉంటుందనే విషయంపై అవగాహన పెంచాలి. అప్పుడే సమాజంలో హక్కులుంటాయని, అవి అందరికీ సమానంగా వర్తిస్తాయని పిల్లలు గుర్తిస్తారు. తద్వారా భవిష్యత్‌లో వారు మృగాళ్లుగా మారకుండా జాగ్రత్తపడవచ్చు.

> సంతోషకరమైన కుటుంబం అంటే.. కళ్లముందున్న స్వర్గం లాంటిది
> - బెర్నార్డ్ షా

## కుటుంబం.. పొదుపు మంత్రం నేర్పే బ్యాంక్ కావాలి..

ఎవరు ఏమన్నా.. ప్రపంచం డబ్బు చుట్టూనే తిరుగుతోందనడంలో సందేహం లేదు. నిజానికి కుటుంబం అంటే ప్రేమ, ఆప్యాయతలే కాదు.. విడదీయలేని బాంధవ్యాలు, వదులుకోని బాధ్యతలూ ఉంటాయి. అందుకోసం అందరూ ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగడం ఎంతైనా అవసరం. గతంలో అవ్వ.. తాత, తల్లీతండ్రి తమ సంపాదనలో కొద్దికొద్దిగా కొంత మొత్తాన్ని దాచివుంచి అవసరమైన సందర్భాల్లో ఖర్చుచేసేవారు. తద్వారా ఎంతమంది సంతానం ఉన్నా, ఎన్ని కష్టాలొచ్చినా.. అప్పుల ఊబిలో కూరుకుపోకుండా జాగ్రత్తపడేవారు. కానీ ప్రస్తుతం భార్యభర్త ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నా.. రుణాలు, ఈఎంఐలు అంటూ బాధలు పడుతూనే ఉన్నారు. కొంతమంది పరిమితికి మించి అప్పులు చేసి చివరికి ఐపీ పెట్టే స్థాయికి దిగజారి పోతున్నారు. దీనికి కారణం ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం. ఇక తల్లిదండ్రులు సంపాదించే మొత్తాన్ని కొందరు పిల్లలు విచ్చలవిడిగా ఖర్చు చేయడం, పార్టీలు, పబ్‌లకు వెళ్లి మద్య, మాంసాల వినియోగం కోసం వెచ్చించడం సర్వసాధారణంగా మారింది. ఈ ధోరణి వల్ల పిల్లలు పెడదోవ పట్టడమే కాకుండా చివరికి తమ విలాసాల కోసం దొంగతనాలకు, దోపిడీలకు పాల్పడే స్థితికి దిగజారుతున్నారు.

> కుటుంబం అంటే ఎవరినీ వెనుకబడిపోనివ్వనిది, ఎవరినీ మరిచిపోనిది
> - డేవిడ్ అర్డన్ స్టైరిస్

## ఇలా చేస్తే అప్పులు.. ఐపీలు ఉండవు..

ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఉండడానికి, వచ్చినా వాటి నుంచి బయటపడడానికి కూడా పిల్లలకు కుటుంబమే మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం డబ్బు విలువను ఎప్పటికప్పుడు తెలియజేయాలి. ముఖ్యంగా చిన్నతనం నుంచి అతిగారాబం తగదని గుర్తించాలి. ఏది ప్రాథమిక అవసరమో.. ఏది విలాసమో స్పష్టంగా నేర్పించాలి.. ఎప్పుడు వస్తువు కొనాలో.. దానిపై ఎంత వెచ్చించాలో.. ఏ పరిమాణంలో కొనుగోలు చేయాలో తెలియబరచాలి. ముఖ్యంగా పొదుపు భవిష్యత్‌కు ఏ విధమైన పునాది వేస్తుందో.. ఎంత భరోసా ఇస్తుందో ప్రాక్టికల్‌గా వారు గుర్తించేలా చేయాలి. ఇలాంటివన్నీ అర్థం చేసుకోవాలంటే విద్య ఎంత అవసరమో తెలియజెప్పాలి. అది ఉద్యోగానికి ఎలా మార్గం చూపుతుందో.. ఉపాధికి ఎలాంటి బీజాలు వేస్తుందో వివరించాలి. అప్పుడే కుటుంబ అర్థశాస్త్రాన్ని కాచివడబోసే అసలు సిసలు చాణక్యులు ప్రతి ఇంటిలో ఉద్భవిస్తారు. ఆర్థిక వనరులను భవిష్యత్ అవసరాల కోసం సమృద్ధిగా పెంపొందించుకుంటారు.

## కుటుంబం.. నాయకత్వ శిక్షణ ఇచ్చే సంస్థ కావాలి..

కౌటిల్యుడు తత్వశాస్త్రంలో చెప్పిన పరిపాలనా సూత్రం యథారాజా.. తథాప్రజా. రాజ్య క్షేమాన్ని తెలియజేసే ఈ వాక్యం.. ప్రతి ఇంటిలో జపించే మంత్రం కావాలి. నేటి ఆధునిక యుగంలో కేవలం రాజకీయ రంగంలోనే కాకుండా అన్ని వ్యవహారాల్లోనూ లీడర్ షిప్ అనేది అత్యంత ముఖ్యమైన అంశంగా మారింది. వ్యాపారమైనా, ఉద్యోగమైనా నాయకుడై ముందుకు నడిపించే గుణం ప్రతిఒక్కరిలో పెంపొందించాల్సిన అవసరం ఉంది. సమర్థులైన సహచరుల ప్రతిభను సకాలంలో గుర్తించకున్నా.. శకునిలాంటి వారిని చేరదీసి అందలం ఎక్కించినా జరగాల్సిన నష్టం కంటికి కనిపించకుండానే జరిగిపోతుంది. ఈ విషయాన్ని పిల్లలు గుర్తుంచుకుని భవిష్యత్‌లో అంచెలంచెలుగా ఎదిగేందుకు తల్లిదండ్రులు సూచనలు చేయాలి. తమ అనుభవాలను, సమాజంలో వస్తున్న మార్పులను వారికి అర్థమయ్యేలా వివరించాలి.

## ఇలా చేస్తే అభినవ అంబేడ్కర్‌లు ఉద్భవిస్తారు..

ప్రజలకు.. ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహకారం లభిస్తుంది.. ఏఏ అంశాల్లో విద్య, ఉపాధి అవకాశాలున్నాయి. ఎలాంటి విషయాల్లో సమష్టిగా పాలుపంచుకోవాలి. ఎలాంటి వారికి దూరంగా ఉండాలో తెలియజెప్పాలి. దేశ సమైక్యతకు, భిన్నత్వంలో ఏకత్వానికి రాజ్యాంగం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటుందో వివరించాలి. మహనీయుల త్యాగఫలాలను, వారి జీవన విధానాన్ని, వారు అనుసరించిన ఆదర్శాలను తెలియజెప్పాలి. అప్పుడే నవతరం నాయకులు ఇంటింటిలో తయారై భవిష్యత్ భారతం బంగారుమయం అవుతుంది.

## కుటుంబం.. ఆరోగ్యసూత్రాలు చెప్పే వైద్యశాల కావాలి

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో మొట్టమొదట దెబ్బతింటున్న అంశం ఆరోగ్యం. నేటికాలంలో చాలామందికి సంపాదనపై ఉన్న శ్రద్ధ ఆరోగ్యంపై లేదంటే అతిశయోక్తి కాదు. జంక్‌ఫుడ్‌లు, ఫాస్ట్‌ఫుడ్‌లకు అలవాటుపడుతున్న జనం.. చివరికి తిండి తినేందుకు కూడా ప్రత్యేకంగా సమయం కేటాయించలేని పరిస్థితి నెలకొంది. ఏ కారులో వెళ్తూనో.. కార్యక్రమం మధ్యలోనో.. భోజనతంతును ముగించేస్తున్నారు. ఇంకా తినలేని పరిస్థితి ఉంటే విటమిన్ ట్యాబ్లెట్లు, ప్రొటీన్ షేక్‌లతోనే బతికేస్తున్నారు. దీనికితోడు ప్రతివస్తువులో కల్తీ.. వాయు, జల, భూ కాలుష్యాలు. ఫలితంగా ప్రజల ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తూ.. 30ల్లోనే 60ల మాదిరి నీరసం, నిస్సత్తువతో అవస్థలు పడుతున్నారు. చివరికి పెళ్లిళ్లకు కూడా వెనుకడుగు వేస్తున్నారు. మరికొందరైతే మందు బిళ్లలనే భోజనం అనే రీతిలో మింగేస్తూ.. జీవితాన్ని నెట్టుకొస్తున్నారు.

## ఇల్లే ఆరోగ్యవనం అనే విషయం తెలియజేస్తే..

మనం రోజూ ఉపయోగించే వస్తువుల్లోనే ఔషధ గుణాలున్నాయని పిల్లలకు పెద్దలు తెలియజేయాలి. ప్రాసెసింగ్ ఫుడ్, దీర్ఘకాలం నిల్వచేసే ప్యాకింగ్ ఫుడ్ వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయో, మద్యం, ధూమపానం ఎందరి ఆరోగ్యాలను దెబ్బతీసి, ఎన్ని జీవితాలను చీకటిమయం చేస్తాయో.. వివరించాలి. ముఖ్యంగా ఇంట్లో పెద్దలు వాటికి దూరంగా ఉండాలి. తక్కువ ధరలు లభించే మొలకెత్తే విత్తనాలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, పాలు, పండ్ల వంటివి ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో.. మసాలాలు, మితిమీరిన కారం, ఉప్పు, తీపి పదార్థాలు ఎలాంటి వ్యాధులకు కారణమవుతాయో తెలియజేయాలి. నడక, వ్యాయామం, యోగాసనాలు వంటివి ఎంత మేలు చేస్తాయో, ఊబకాయం, మలబద్ధకం లాంటి సమస్యలకు ఎలా చెక్ చెబుతాయో అవగాహన కల్పించాలి. అప్పుడే ప్రతి ఇంటిలో ఆరోగ్యసిరులు వెల్లివిరుస్తాయి.

## సమస్యలొచ్చినప్పుడు సైన్యమై నిలవాలి..

ఇక ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. సైబర్ క్రైం రూపంలోనో, సామాజిక మాధ్యమాల వేదికగానో, స్నేహితులు, తెలిసిన వారి రూపంలోనో కష్టాలు, నష్టాలు, మోసాలు ఎదురవుతుంటాయి. అలాంటి సమయంలో కుటుంబం మొత్తం అయినవారికి బాసటగా నిలవాలి. చేసే పని మంచిదని భావిస్తే.. ఎంతపెద్ద సమస్య వచ్చినా సైన్యమై వెంట నిలవాలి. కొండంత ధైర్యమివ్వాలి. మొత్తానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతిఒక్కరికీ ఓ మంచి కుటుంబం కావాలి.!

- బాలూ బాబు

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16 THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 1 06.06.2025, శుక్రవారం వెల : రూ. 10 /-

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## మాతో పెట్టుకుంటే..

# బుక్కైపోతారు



- తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో విష సంస్కృతి
- రెడ్‌బుక్, పింక్ బుక్‌ల పేరుతో బెదిరింపులు
- పగ, ప్రతీకారాలే లక్ష్యంగా సవాళ్ళు
- కొత్త సంప్రదాయానికి తెరలేపిన ప్రాంతీయ పార్టీలు

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో బుక్కుల సంస్కృతి నడుస్తోంది. గత ఐదేళ్ళ వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన విధ్వంస రచనా సారథుల చిట్టాను తయారుచేసి రెడ్‌బుక్‌లో ఎక్కిస్తున్నామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ యువత నేత నారా లోకేష్ ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక వారి సంగతి తేలుస్తానని కూడా తన యువగళం పాదయాత్రలో తేల్చిచెప్పారు. ప్రకటించినట్లుగానే తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడాది కాలంలోనే చెప్పింది చెప్పినట్లు చేస్తున్నారు. వరుస క్రమంలో ఒక్కొక్కరిని బుక్ చేసి కటకటాలపాలు జేస్తున్నారు. దీనికి ప్రతిగా ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ కూడా "ఏ బుక్ అయినా పర్వాలేదు, మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అధికారులు, నాయకుల పేర్లను నోట్ చేసుకోండి, మనం అధికారంలోకి వచ్చాక వారి పని పడదాం" అంటూ తమ పార్టీ నాయకులకి కార్యకర్తలకి పిలుపునిచ్చారు. ఇదంతా ఓవైపు అనుకుంటే ప్రస్తుతం తెలంగాణలోనూ ఇదే సంస్కృతి మొదలైనట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు విని తమ కార్యకర్తలను వేధిస్తున్న నాయకులు, అధికారుల పేర్లను 'పింక్‌బుక్'లో నమోదు చేస్తున్నామని, బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారందరిపై ప్రతీకారం తప్పదని కేటీఆర్, హరీష్‌రావు ప్రకటించడం సంచలనం రేపుతోంది.

### అసలైన బుక్ అంటే రాజ్యాంగం...!

నిజానికి ప్రభుత్వం ఎలా నడవాలి. చట్టాలు ఎలా అమలు చేయాలి, శాంతితభద్రత పర్యవేక్షణ ఎలా ఉండాలో తెలియజేసే నియమ నిబంధనల సంపుటి రాజ్యాంగం. ఈ బుక్‌లో పేర్కొన్న ప్రకారమే పాలన సాగాలి. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన తర్వాతే నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతలు స్వీకరిస్తారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం స్వార్థం, పగా ప్రతీకారాలంటూ వ్యక్తిగత కక్షలకు నాయకులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు వ్యతిరేకంగా పనిచేసిన వారికి చుక్కలు చూపిస్తూ.. తమ ఇగోను చల్లార్చుకుంటున్నారు. దీంతో అభివృద్ధి, సంక్షేమం కంటే అరెస్టులు, కేసులు, బెయిళ్లు, జైళ్లు మీడియాలో పతాక శీర్షికలవుతున్నాయి. జనంలోనూ చర్చనీయాంశాలవుతున్నాయి.

### అంబేడ్కర్ చెప్పిందేమిటీ..? జరుగుతున్నదేమిటీ..?

పాలకులు అవినీతి, ఆశ్రిత పక్షపాతంతో పాలన సాగిస్తే, స్వార్థమే పరమావధిగా పనిచేస్తే ప్రజల హక్కులు హరించుకుపోతాయి. అరాచకాలు పెచ్చుమీరుతాయి. ప్రజాస్వామ్య వ్యవస్థపై రాజనీతి శాస్త్ర పితామహుడు అరిస్టాటిల్ అభిప్రాయం ఇది. మెజారిటీ పేరుతో అక్రమార్కులకు అధికారమిస్తే, రాజ్యం దుర్మార్గులకు నిలయమై నిత్యం, దుశ్శాసన పర్వాలు తప్పవు. ప్రస్తుత రాజకీయాలు ఇందుకు సరిగ్గా సరిపోతాయంటే అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే వందలాది దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటించే మనదేశానికి అనుగుణంగా ఉండేందుకు, ప్రభుత్వాలు సుపరిపాలన అందించేందుకు కొన్ని మార్గదర్శక సూత్రాలను భారత రాజ్యాంగంలో పొందుపరిచారు. రాజ్యాంగాన్ని రూపొందించిన ముసాయిదా కమిటీని అధ్యక్షుడి హోదాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ముందుండి నడిపించారు. దేశంలో ప్రజల బాగోగులు, వారి అభివృద్ధి, సంక్షేమంతో పాటూ శాంతిభద్రతలు, వనరుల పరిరక్షణ బాధ్యతలను ఆయా ప్రభుత్వాలకు అప్పగించారు. సమర్థవంతమైన పాలన అందించే క్రమంలో ప్రతిపక్షాలు, పాత్రికేయులు, విశ్లేషకులు, విమర్శకుల ప్రాధాన్యతనూ వివరించారు. భిన్నవాదనలకు, అభిప్రాయాలకు చోటిచ్చేలా వ్యవహరించాలని హితబోధ చేశారు. చట్ట సభల్లో సరైన చర్చల ద్వారానే సహేతుకమైన నిర్ణయాలు తీసుకోగలమని, తీర్మానాలు రూపొందించగలమని స్పష్టం చేశారు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం రాజ్యాంగంలోని మూలసూత్రాలకు తిలోదకాలిచ్చేలా, వైరి పక్షాలను చెరపట్టేలా 'రెడ్‌బుక్' పేరుతో పాలన సాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యథారాజ తథాప్రజ అన్నట్లుగా ప్రభుత్వ పెద్దలు అవలంభిస్తున్న కక్ష పూరిత విధానాలను వంటబట్టించుకున్న వారి అనుయాయులు సైతం తమ వాచాలత్వాన్ని ప్రదర్శిస్తూ విక ృతానందం పొందుతున్నారు. చిన్నాపెద్ద, ఉచ్చం నీచం వంటివి మరిచి పేట్రేగిపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇతర పార్టీల నాయకులపై దాడులకు సైతం తెగబడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### సమిధలవుతున్న అధికారులు

అధికార, ప్రతిపక్షాలు వ్యక్తిగత కక్షలతో రాజకీయాలు చేస్తుండడంతో అది అధికారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో వారు రెంటికీ చెడ్డ రేవడవుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. తమకు అనుకూలంగా, చెప్పినట్లు చేయాలని పాలక పక్షాలు ఓ వైపు ఒత్తిడి చేస్తుంటే, నిబంధనలు అతిక్రమించి వేధింపులకు, అరెస్టులకు పాల్పడితే మేం ప్రభుత్వంలోకి వచ్చాక మీ అంతు చూస్తాం, మీ బట్టలూడదీసి నిలబెడతాం, అంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు మరోవైపు హెచ్చరిస్తున్నారు. దీంతో విడవమంటే పాముకు కోపం, కరవమంటే కప్పకు కోపం అన్న చందంగా తమ పరిస్థితి తయారైందని, చివరికి ప్రభుత్వ ఉద్యోగం అంటేనే పులిమీద స్వారీగా మారిందని అధికారులు వాపోతున్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులతో ఆ పార్టీ అధినేత జగన్ మాట్లాడుతూ, జగన్ 2.0 పాలన గతంలోలాగా ఉండదని, కార్యకర్తలకే తొలి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న అరెస్టుల పర్వంపై కూడా ఘాటు వ్యాఖ్యలు చేశారు. లోకేష్ 'రెడ్‌బుక్' పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులను వేధిస్తున్నారని దానికి తగిన ప్రతీకారం తప్పదని హెచ్చరించారు. నాయకులు, కార్యకర్తలు

4లో

## లాయర్ @ 44

## అక్షర సమరానికి

# నలభై నాలుగేళ్ళు పూర్తి

నెల్లూరీయుల ప్రియపుత్రిక మన లాయర్ వార్తా పత్రిక 44 ఏళ్ళ అక్షరయజ్ఞాన్ని దిగ్విజయంగా పూర్తిచేసుకుని.. జూన్ 5, 2025న.. 45వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఇన్నేళ్ళ ప్రయాణంలో లాయర్ ఎన్నో ఆటుపోట్లని ఎదుర్కొంది. ఆత్మస్థైర్యంతో అనేక విజయాల మైలు రాళ్ళను అధిగమించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదో నిరంతర అక్షర సమరమే..!

స్థానిక పత్రికా ప్రపంచంలో లాయర్ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సాధించుకుందంటే.. 'ఇది మన పత్రిక' అని అక్కున చేర్చుకున్న పాఠకుల ఆదరాభిమానాలే అందుకు ప్రధాన కారణం. పాఠకుల అభిలాషకి అనుగుణంగా లాయర్‌ని వారం వారం వారి ముంగిట ఆవిష్కరించ గలగడం వల్లనే అది సాధ్యమయ్యింది. వాస్తవానికి ఒక స్థానిక పత్రికను నడపాలంటే కత్తిమీద సామే. ప్రజల ఆదరణ, పాఠకుల అభిమానం, చందాదారులు, ప్రకటనకర్తల సహకారం నిండుగా, మెండుగా, దండిగా ఉంటే తప్ప స్థానిక పత్రికలు నడవలేవన్నది జగమెరిగిన సత్యం.

ఏ పత్రికైనా ప్రజాదరణ పొందాలంటే ఆ పత్రికపై జనానికి విశ్వాసం ఉండాలి. ఆ పత్రికలో రాసే రాతలపై నమ్మకం కలగాలి. ప్రజా సమస్యలపై నిత్యం అక్షర పోరాటం సాగిస్తూ, నిజాలను నిర్భయంగా పాఠకుల ముందు ఉంచగలిగినప్పుడే ఆ పత్రికపై ప్రజలకి ఆసక్తి ఉంటుంది. ఈ లక్షణాలన్నీ మన లాయర్‌కి పుష్కలంగా ఉన్నాయి కాబట్టే, గత నలభై నాలుగేళ్ళుగా మన లాయర్ నిఖార్సయిన పత్రికగా నెల్లూరీయుల ప్రియ పత్రికగా పాఠకుల మన్ననలు అందుకుంటోంది. ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా మన లాయర్ తన అలుపెరుగని అక్షరయాత్రను సుదీర్ఘంగా కొనసాగిస్తోంది.

నాలుగున్నర దశాబ్దాల క్రితం లాయర్ వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి సంకల్పబలంతో, ఉద్యమ స్ఫూర్తితో మన లాయర్ పత్రిక పురుడుపోసుకుంది. ఓ చారిత్రాత్మక సంస్థని, ఆ సంస్థ ఆస్తులని అక్రమార్కుల కబంధహస్తాల నుంచి కాపాడాలనే దృఢమైన లక్ష్యంతోనే లాయర్ పుట్టింది. ఆనాటి నుండి నేటి వరకు ఉద్యమదీప్తిగా, అక్షరస్ఫూర్తిగా, అన్యాయాన్ని ఎదిరించే వార్తా వీచికగా, సమగ్ర సమాచార కరదీపికగా మన లాయర్ ప్రకాశిస్తోంది.

ఇన్నేళ్ళ లాయర్ జీవితయానంలో ఎన్నో కష్టాలున్నాయ్, కన్నీళ్లూ ఉన్నాయి. వాటన్నిటినీ ఆత్మవిశ్వాసంతో అధిగమించింది మన లాయర్. ఎన్నో అద్భుతాలని ఆవిష్కరించింది. అనేక అసాధ్యాలని సుసాధ్యం చేసింది. అంతర్జాతీయ అవార్డులని సైతం తన సొంతం చేసుకుంది. ఆ విజయాలన్నిటి వెనుకా ప్రపంచవ్యాప్తంగా ఉన్న నెల్లూరీయుల దీవెనలున్నాయి. 'మీ వెనుక మేమున్నాం' అంటూ లాయర్ ఆత్మీయులు, అభిమానులు, హితులు, సన్నిహితులు అందిస్తున్న ఆశీస్సులే, కొండంత ధైర్యంతో మన లాయర్‌ను ముందుకు నడిపిస్తున్నాయి.

మన లాయర్ పత్రిక 45వ ఏట అడుగిడిన ఈ శుభసమయంలో లాయర్ పాఠకులు, ప్రకటనకర్తలు, అభిమానులు, ఆత్మీయులందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు!.. మీరందిస్తున్న స్ఫూర్తితో, మీరిచ్చిన కీర్తిని కాపాడుకుంటూ నిరంతరం నిరంతరాయంగా, నిర్భీతిగా.. నిజాయితీగా ముందుకు సాగుతామని ప్రతినబూనుతూ, మీ అందరి సేవలో మరోసారి పునరంకితమౌతున్నాం. ఈ 44వ వార్షికోత్సవం సందర్భంగా శుభాభివందనాలు తెలుపుకుంటున్నాం!..

తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)



# ఏడాది పాలనలో.. ఎన్నో అద్భుతాలు

## - కొనియాడిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి నేతృత్వంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధిని సాధిస్తోందని, ఈ ఏడాది పాలనలో ఎన్నో అద్భుత కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని మాజీమంత్రి,సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. వృద్ధిరేటులో జాతీయ స్థాయిలో మన రాష్ట్రం ఇప్పుడు రెండో స్థానంలో ఉందన్నారు. ముత్తుకూరు మండలం పిడతాపోలూరు, ముసునూరువారిపాళెంలో ఇటీవల ఆయన ప్రజలతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలన అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రతినెలా 16.64 కోట్ల రూపాయల మేరకు ప్రజలకు పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. ఈ ఏడాదిలో ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే సుమారు 121 కోట్ల రూపాయల వ్యయంతో, 685 అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అదేవిధంగా 8497 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందుకుంటున్నారని, జూన్ 12 నుంచి వితంతువులకు మరో 2 వేలు కొత్త పింఛన్లు అందబోతున్నాయని తెలిపారు. తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. ఈనెలలోనే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం కార్యక్రమాలు ప్రారంభం కాబోతున్నాయన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా ప్రతి రైతుకు కేంద్ర నిధులు(రూ.6 వేలు)తో కలిపి మొత్తం రూ.20 వేలు అందించబోతున్నామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా చదువుకునే ప్రతి బిడ్డ రూ.15 వేలు అందుకోనుందని, ఆగస్టు 15న మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలుకానుందని తెలిపారు. వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి హయాంలో రాష్ట్ర ప్రజలు ఎంతో నష్టపోయారని, కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబు సామర్థ్యంతో రాష్ట్రంలో పాలన గాడిలో పడుతోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రం అద్భుత ఫలితాలు సాధిస్తోందని ఆయన కొనియాడారు.

### పలువురు నాయకులు.. వైకాపా నుంచి టీడీపీలోకి:



సర్వేపల్లి నియోజకవర్గంలో పలువురు కీలక నాయకులు ఇటీవల వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరిపోతున్నారు. వైకాపా యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌రెడ్డి, వెంకటాచలం మండలం అనికేపల్లి సర్పంచ్ కొమరగిరి శీనమ్మ, ఎంపీటీసీ సభ్యులు మోడిబోయిన సుమతి, మేకల రమణమ్మ, పంచాయతీ వార్డు సభ్యులు పర్వతాల నిర్మల, చెవికల కిరణ్, తొలికొండ లత, గాలి వెంకట రమణయ్య, ఏకుల వెంకటరమణమ్మ, పట్రా సుబ్రహ్మణ్యం, అన్నపరెడ్డి శీనయ్య, దారా వెంకటమ్మ, మచ్చా బుజ్జమ్మ, ఉడతా వాణితోపాటు 200కి పైగా కుటుంబాల వారు టీడీపీలో చేరిపోయారు. ఈ సందర్భంగా అనికేపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. కోడూరు ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, టీడీపీలో చేరిన వారందరినీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆత్మీయంగా పార్టీలోకి స్వాగతించి అభినందించారు.

## రిటైరైన ఉద్యోగులకు..

# త్వరలోనే ఎలక్ట్రానిక్ పింఛన్ పత్రాలు

## రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ వెల్లడి



పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలోనే ఎలక్ట్రానిక్ పద్ధతిలో పెన్షన్ మంజూరు పత్రాలను అందజేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ చెప్పారు. ఈనెల 4న నెల్లూరు నగరంలోని కస్తూరా కళాక్షేత్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా, 55 మందికి పెన్షన్ మంజూరు పత్రాలను, 15 మందికి జీపీఎఫ్ ఆథరైజేషన్ లేఖలను నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పెన్షన్ ప్రతిపాదనల మంజూరు ప్రక్రియను ఏజీ కార్యాలయంలో ఏవిధంగా జరుగుతుందో తెలుసుకోవాలన్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా, పెన్షన్ ప్రతిపాదనలను పంపే సమయంలో దరఖాస్తుతో పాటు ఏయే పత్రాలను జతపరచాలో కూడా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఆ ప్రతిపాదనలను పంపేందుకు రిటైర్ అయ్యేంతవరకు వేచి ఉండక్కర్లేదని, మూడు నెలలు ముందుగానే పంపవచ్చని తెలిపారు. కానీ అనేకమంది ఇప్పటికీ పదవీ విరమణ చేసిన అనంతరమే పెన్షన్ ప్రతిపాదనలను పంపుతున్నారని ఆమె అన్నారు. దీనివల్ల ఆయా ఉద్యోగులు రిటైర్ అయ్యాక పెన్షన్ మంజూరు కాలేదని ఆవేదన చెందుతున్నారన్నారు. ఈనెల నుండి ఆర్థికశాఖ పరిధిలోని ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్, ఏపీజీఎల్ఐ తదితర శాఖల నుండి రిటైరయ్యే ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఇపిపిఓ పెన్షన్ మంజూరు పత్రాలను అందజేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తును సమర్పించవలసిన విధానం గురించి వీడియో తయారు చేయడం జరిగిందని, దానిని ఉద్యోగులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఉద్యోగులు సాధారణంగా నిర్ణీత సమయంలో పంపకపోవడం, సంతకాలు చేయకపోవడం, నామినేషన్ పత్రాలను సరిగా నింపకపోవడం తదితరాల వలన పెన్షన్ మంజూరు ఆలస్యం అవుతుందన్నారు. ఇప్పటివరకు ఇటువంటి అదాలత్‌లు పది జిల్లాల్లో పూర్తి చేశామని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సేవలందించేందుకు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని వివరించారు. రాష్ట్ర ట్రెజరీ శాఖ డైరెక్టర్ మోహన్ రావు, డీఆర్‌ఓ ఉదయభాస్కర్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కిషోర్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# బుక్కైపోతారు

(మొదటిపేజీ తరువాయి)

గ్రామస్థాయి నుంచి బుక్ మెయింటెయిన్ చేయాలని అది ఏ రంగు బుక్ అయినా పర్వాలేదని, కానీ అన్యాయం చేసే నాయకులు, అధికారుల పేర్లు మాత్రం వాటిలో రాసుకోండని పిలుపునిచ్చారు. సదరు అధికారులు రిటైర్డ్ అయినా, నాయకులు సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టబోమని తేల్చిచెప్పారు.

### తెలంగాణలో గులాబీ గోల..

ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తెలంగాణలోనూ ఫ్యాక్షనిస్టుల తరహాలో కక్షలు, కార్పణ్యాలతో కూడిన రాజకీయాలు మొదలైనట్లు కనిపిస్తోంది. దీంతో అక్కడ కూడా అధికారుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డారనే తరహాలోనే సాగుతోంది. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో కొందరు అధికారులు కేసీఆర్‌కు, కేటీఆర్‌కు, హరీష్‌రావ్‌కు తొత్తుల్లా వ్యవహరించి కాంగ్రెస్, బీజేపీ నాయకులను చిన్నచూపు చూశారనే వాదనలున్నాయి. దీంతో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అలాంటి వారికి పోస్టింగ్‌లు కేటాయించకపోవడమే కాకుండా, సస్పెండ్ చేసింది. ఇదే క్రమంలో పలువురు బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులను కూడా అరెస్టు చేసింది. దీంతో అప్పటివరకు ఐఏఎస్, ఐపీఎస్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం స్వార్థానికి వాడుకుంటోందని, వేధిస్తోందని ఆరోపించిన బీఆర్ఎస్ తాజాగా పాలకుల మాటలు విని తమ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న అధికారుల పేర్లను 'పింక్ (గులాబీ)బుక్'లో రాస్తున్నామని... తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వారి అంతు చూస్తామని బెదిరింపులకు దిగడం గమనార్హం.

### బుక్కులతో ప్రజలకు ఒరిగేదేమిటి..?

రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం అంటే ప్రజలు. ప్రభుత్వం అంటే రాజ్యం. ప్రభుత్వం అంటే పాలన. ప్రభుత్వం అంటే సంక్షేమం, ప్రభుత్వం అంటే అభివృద్ధి. కానీ, ప్రస్తుత నాయకులు చట్టాన్ని తమ చుట్టంగా చేసుకుని రాజుల తరహాలో స్వయంపాలన సాగిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. తమ ఇగోలు చల్లార్చుకోవడానికి, కక్షలు తీర్చుకోవడానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని పూర్తిగా వాడుకుంటున్నారు. దీంతో అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతలు పోయి వాటి స్థానంలో దాడులు, అరెస్టులు, వ్యక్తిగత విమర్శలు రాజ్యమేలుతున్నాయి. వీటివల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరదం లేదు. పైగా రాష్ట్రాల అభివృద్ధి కూడా కుంటుపడుతోంది. ఇప్పటికైనా రాజకీయ నాయకుల్లో పరిణితి, అధికారుల్లో ఆత్మవిమర్శ వస్తేకానీ ఈ విష సంస్కృతి మారే పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకోసం పాలకులు, ప్రతిపక్ష నాయకులు అసలైన బుక్ అంటే రాజ్యాంగం అనే విషయాన్ని గుర్తెరిగి ప్రవర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది..!

# హామీలు నెరవేర్చకుండానే.. సంబరాలా?

## • నెల్లూరులో వైకాపా నిరసన ర్యాలీ




కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసి సంబరాలు చేసుకుంటోందని విమర్శిస్తూ, ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 4న వైకాపా ఆధ్వర్యంలో నెల్లూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. వైకాపా పిలుపుమేరకు చేపట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో భాగంగా నగరంలోని రైల్వేఫీడర్స్‌రోడ్డులో ఉన్న వెటర్నరీ హాస్పిటల్ నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో వైకాపా రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, వాలంటీర్‌లకు ఇచ్చే రూ.5 వేలును రూ.10వేలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక వారిని నిర్ధాక్షిణ్యంగా తొలగించారని, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తామని ఆ ఊసేలేకుండా ప్రభుత్వం మిన్నకుండిపోయిందని దుయ్యబట్టారు. ఇంటి వద్దకే వెళ్తున్న రేషన్ వాహనాలను నిలిపివేసి, లబ్ధిదారులే నడిచివెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాలని చెప్పడం దారుణమన్నారు. విద్యార్థులకు రూ.15వేలు, మహిళలకు రూ.18వేలు ఇస్తామని, ప్రతి నెలా మహిళలకు రూ.15వందలు అకౌంట్‌లలో వేస్తామని బూటకపు హామీలు కురిపించి ప్రజలను చంద్రబాబునాయుడు మరోసారి మోసం చేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కుమారుడు లోకేష్ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కువ శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే మహిళలపై అరాచకాలు జరిగాయన్నారు. కూటమి నాయకులు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామని మరిచి కక్షసాధింపులు, రాజకీయ కక్షలకు తెగబడుతున్నారన్నారు. రాష్ట్రంలో రాజకీయ కక్షసాధింపులు, రాజకీయ హత్యల కారణంగా ఎంతోమంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల కంటే, చంద్రబాబు నాయుడు ఎక్కువ హామీలు ఇవ్వడంతో తమకింకా మేలు కలుగుతుందని ప్రజలు ఆశపడి మోసపోయారన్నారు. అనంతరం ఆర్‌డీఓ కార్యాలయంలోని అధికారికి ఆమేరకు వినతిపత్రం అందచేశారు.

ఈ ర్యాలీలో జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైకాపా రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు-కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంచివాళ్లు వైకాపాలో ఉండలేరు

## - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



మంచివాళ్లు వైకాపాలో ఉండలేరని, దైవనిర్ణయం మేరకే తాను తెలుగుదేశం పార్టీలో చేరానని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) చెప్పారు. ఇటీవల ఆయన కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలం కమ్మపాళెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సమర్థత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే వుందన్నారు. వారి సంక్షేమ పాలనకు ఆకర్షితులై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారన్నారు. పాత కొత్త నాయకుల మధ్య సమస్యలేమైనా ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదల గడప దాకా చేర్చే బాధ్యత తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలదేనన్నారు. ఈ కార్యక్రమంలో అనేకమంది వైకాపా వారు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరినీ వేమిరెడ్డి దంపతులు స్వాగతించి అభినందించారు. అనంతరం, విపిఆర్ సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు, లోకేష్‌బాబుల సంక్షేమ విధానాలకు ఆకర్షితులై ఎంతో మంది వైకాపాను వదిలిపెట్టి, తెలుగుదేశం పార్టీలోకి చేరుతుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అందరూ కలసి సమన్వయంతో ప్రజలు ప్రభుత్వానికి మధ్య నాయకులు వారధిగా వుంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తన పట్ల నమ్మకం వుంచి తన వెంట రాజకీయ ప్రయాణం చేస్తున్న నాయకులకు అండగా వుంటానన్నారు. తొలుత, స్థానిక నాయకుడు బెల్లం వెంకయ్య నాయుడు ఆధ్వర్యంలో 1500 మందికి పైగా వైకాపా నాయకులు వేమిరెడ్డి దంపతుల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వైకాపా నాయకులు గరిక మస్తానయ్య, పెమ్మారెడ్డిపాళెం ఎంపీటీసీ ఉరుటూరు శేషమ్మ, కమ్మపాళెం సర్పంచ్ చౌటూరు లక్ష్మయ్య, రెడ్డిపాళెంకు చెందిన వైకాపా నాయకులు నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, కమ్మపాళెం ఎంపీటీసీ పీరం అరుణ కుమారి, రామన్నపాలెం సర్పంచ్ కాకి శ్రీనివాసులు తదితర నాయకులకు టీడీపీలో చేరడంతో వారికి వేమిరెడ్డి దంపతులు తెలుగుదేశం కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం, పలువురు నాయకులు మాట్లాడుతూ, చంద్రబాబునాయుడి అభివృద్ధి విధానాలు, వేమిరెడ్డి దంపతుల నిస్వార్ధ సేవా కార్యక్రమాలకు ఆకర్షితులమై తాము తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండల టీడీపీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పాత నేరస్థులపై

## నిఘా పెంచండి

### - పోలీసులకు ఎస్పీ ఆదేశం -

పాత నేరస్థులపై నిఘా పెంచాలని, ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని పోలీసులను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. ఈనెల 4న ఆయన స్థానిక వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులపై నిఘా ఉంచాలన్నారు. గొలుసు దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. నగర డిఎస్పీ సింధు ప్రియ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### ప్రజలపై..

## ఇళ్ల పన్నుల భారం

### - సీపీఎం నాయకుల విమర్శ -



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైందని, ఈ సందర్భంగా ప్రజలపై అదనపు భారాలను మోపేందుకు సిద్ధమవుతోందని సీపీఎం నాయకులు విమర్శించారు. ఈనెల 4న నెల్లూరులో సీపీఎం జిల్లా కార్యాలయంలో నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కతారి అజయ్‌కుమార్, సింహపురి పౌర సమాఖ్య నాయకుడు అత్తిమూరు శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ, నెల్లూరు నగరంలో 20శాతం ఇళ్ల పన్నులు పెంచడంతో పాటు, విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తోందన్నారు. ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలును మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం ప్రజలకు అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలన్నారు. అనంతరం, 'స్మార్ట్ మీటర్లు వద్దు-కరెంటు చార్జీలు తగ్గించాలి' అంటూ గోడపత్రికలను ఆవిష్కరించారు. నాయకులు పెంచలనరసయ్య, సూర్యనారాయణ, ఆసిఫ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.




లాయర్
జూన్ 06, 2025

# ఆత్మస్థైర్యానిదే.. అంతిమ విజయం!

ఏదైనా అనుకున్నది సాధించగలిగితే ఎంత సంతోషమో చెప్పలేం. అదే దాదాపు 18 ఏళ్ల కల.. సాకారమైతే ఇంకెంత ఆనందమో!..అందులోనూ ఏళ్ళ తరబడిగా ఐపీఎల్ ట్రోఫీ దక్కుతుందని ఆశగా ఎదురుచూస్తూనే 18 ఏళ్లు గడిచిపోవడం విరాట్‌కోహ్లీ వంటి అత్యుత్తమ క్రికెటర్‌కు ఎంత వేదన కలిగించి ఉంటుందో ఊహించలేం. మూడుసార్లు ఫైనల్స్ దాకా వచ్చినా, చివరి క్షణంలో కప్పు చేజారిపోతే ఎంత బాధాకరమో కదా!.. అయినా సరే, పట్టుదలతో ఆడి, కప్పు సాధించుకుని క్రికెట్ మైదానంలో బెంగుళూరు జట్టు జయభేరి మోగించింది. అహ్మదాబాద్ క్రికెట్ మైదానంలో అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన క్రికెట్ పోటీల్లో..ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ ఎడిషన్ విజేతగా బెంగళూరు రాయల్ చాలెంజర్స్ జట్టు విజయకేతనం ఎగరేసింది. ఆరు పరుగుల తేడాతో పంజాబ్ జట్టును ఓడించి చరిత్రాత్మక విజయం సాధించింది. 18 ఏళ్లుగా కలలు కంటున్న ఐపీఎల్ ట్రోఫీని సాధించి ఐపీఎల్‌లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించింది. యువ కెప్టెన్ రజత్‌పటీదార్ సారథ్యంలో తొలిసారిగా బెంగళూరుకు ఐపీఎల్ టైటిల్‌ను అందించడంతో కోహ్లీ-ఆర్సీబి అభిమానుల హృదయాలు పులకించిపోయాయి. ఆ జట్టుకి హీరో అయిన విరాట్‌కోహ్లీ అయితే, కప్పు గెలుచుకున్న సంతోషంతో మైదానంలోనే భావోద్వేగానికి గురయ్యారు కూడా.

వాస్తవానికి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకోవడమంటే మాటలు కాదు. క్రికెట్‌లో ఆరితేరిన మహామహా ఆటగాళ్ళున్నప్పటికీ ఎన్నో జట్లు చివరిదాకా రావడానికే నానా తంటాలు పడాల్సివస్తుంది. చివరిలో కప్పు ఎవరికి దక్కుతుందో తెలియదు. ఐపీఎల్ ప్రారంభమైనప్పటినుంచి లీగ్‌లో ఉంటూ, ఒకే జట్టుకు ఆడుతున్న ప్రఖ్యాత క్రికెటర్..స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీని కూడా..ఐపీఎల్ కప్పు ఇంతకాలంగా ఇదిగో..అదిగో అంటూ ఏళ్ళ తరబడిగా ఊరించిందంటే అతిశయోక్తి కాదు. ఎంత నేర్పుగా ఆడినా కప్పు చేతికి చిక్కేదే కాదు. కొన్నిసార్లు చిక్కినట్లే చిక్కి ప్రత్యర్థుల భుజాలెక్కేది. చెన్నై సూపర్‌కింగ్స్‌కి అయిదుసార్లు, ముంబై ఇండియన్స్ జట్టుకు మరో అయిదు సార్లు అందిన కప్పు, బెంగళూరు రాయల్ చాలెంజర్స్ జట్టుకు మాత్రం అందేది కాదు. ఆటలో సత్తా ఉన్నా, పాపం..అదృష్టం కలిసివచ్చేది కాదు. కోహ్లీ కెప్టెన్‌గా ఉన్నప్పుడు కూడా ఎలాగైనా కప్పు సాధించాలని ఎంతగా ప్రయత్నించినా ఆ జట్టుకు నిరాశే మిగిలింది. అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎన్నో విజయాలు సాధించినా, ఐపీఎల్‌లో కప్పు సాధించలేకపోవడం కోహ్లీని మరింతగా వేదించేది. అయినా సరే, కోహ్లీ కుంగిపోలేదు. ఈసారి రాయల్ చాలెంజర్స్ జట్టు కప్పును గెలవాలని చాలెంజ్‌గా తీసుకుని మరీ మైదానంలోకి దిగింది. తొలినుంచీ ఆటలో మెరుపులు మెరిపించింది. ప్రత్యర్థులను హడలెత్తించింది. అభిమానులను హోరెత్తించింది. ఈ జట్టులోని ప్రతి ఆటగాడు తనదైన ప్రతిభతో తమ సత్తా చాటుకున్నాడు. చివరికి.. 'కష్టే ఫలే'.. అన్న మాటే వారి విషయంలోనూ రుజువైంది.

ఇక్కడొక మహత్తరమైన విషయం ఉంది. గత 18 ఏళ్ళుగా ఎన్నిసార్లు నిరాశకు గురైనా, పట్టువీడకుండా విజయం కోసం పోరాడిన పరుగుల వీరుడు కోహ్లీ..ఆ జట్టు సాధించిన ఈ ఘనవిజయం క్రికెట్‌లోకానికే ఒక పెద్ద ల్యాండ్ మార్క్‌గా చెప్పుకోవచ్చు. ఎవరికైనా సరే..ఏ విజయం కూడా అంత తేలిగ్గా లభించదు. అందుకు తగ్గట్టు శ్రమపడాలి. పట్టుదలతో, దీక్షాదక్షతలతో అనుకున్న లక్ష్యం సాధించాలి. ఓడిపోతామనే నిరాశతో కుంగిపోకుండా ప్రతి ఆటగాడు ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవాలి. అపజయాలను విజయాలకి సోపానాలుగా మార్చుకోగలగాలి. కష్టనష్టాలెన్నున్నా సరే.. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి. అప్పుడే విజయం చేరువవుతుందనడానికి కోహ్లీయే ఒక ప్రత్యక్ష ఉదాహరణ. ఐపీఎల్‌లో ఎన్నోజట్లు పాల్గొన్నాయి. ప్రతిభావంతంగానే ఆడాయి. కానీ, గెలుపోటములు ఎవరికైనా సర్వసాధారణమే. ఈసారి ఓడిన వారు.. రేపు గెలవవచ్చు. 18 ఏళ్ల కప్పు గెలుచుకోకపోయినా.. ప్రతి ఏటా మరింతగా శ్రమించి ఆడడం, ఎట్టకేలకు కప్పును కైవసం చేసుకోవడం ఐపీఎల్ చరిత్రలోనే కాదు, క్రికెట్ రంగంలోనే ఒక గొప్ప విశేషం. అయినా, ఓడిపోయామనే కుంగిపోయేదానికన్నా, కోహ్లీలా ముందుకు సాగాలనే లక్ష్యం అందరిలో ఉంటే..విజయాలు దక్కకుండా ఎక్కడికి పోతాయి?!..ఆత్మస్థైర్యానికే అంతిమ విజయం లభిస్తుంది. ఏదేమైనా.. ఎంతో కష్టపడి ఆడి గెలిచిన.. కోహ్లీకీ.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు క్రీడాకారు లకు.. అందరికీ విజయాభినందనలు!




## ఓవైపు ఆకలికేకలు.. మరోవైపు ఆత్మహత్యలు!

'పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అన్న సామెతలా తయారైంది మన దేశ పరిస్థితి. ఓవైపు ప్రగతి, మరోవైపు కనీసం సక్రమంగా జీవించలేని దుర్గతి. ఇవి రెండూ కళ్ళకి కట్టినట్లు కనిపిస్తూనే ఉన్నాయి. అభివృద్ధికి, సమానతకు లంకె కుదరడం లేదు. కాలం జరిగిపోతూనే ఉన్నా, ఈ అసమానతలే దేశానికో పెద్ద శాపంగా ఉంటున్నాయి. అయితే, నిజానికి గతంలో కంటే ఇప్పుడెంతో మేలు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని అందుకుంటూ మనదేశం అభివృద్ధి దిశగా పయనం సాగిస్తుండడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, ఆ అభివృద్ధి సరైన రీతిలో సాగడం లేదన్నదే అందరి ఆవేదన. దేశంలో ఏ కొందరో ధనవంతులుగా ఉండడం, అత్యధిక శాతం మంది ప్రజలు తరాల తరబడి దుర్భర దారిద్ర్యంలోనే మగ్గుతుండడం సమగ్రమైన అభివృద్ధి కాబోదు. దేశంలో అనాదిగా అసమానతలు, పేదరికం, నిరుద్యోగం వంటివి ప్రబలిపోతున్నాయే తప్ప, తగ్గడమే లేదు. తినేవాడు తింటున్నాడు, లేనివాడు పస్తులుంటున్నాడు. ఈ లేనివాళ్ళ సంఖ్యే దేశంలో అతిపెద్దదిగా ఉంటోంది. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనదేశం రికార్డు సాధించబోతోందనే సమాచారం సంతోషకరమైనదే అయినా, దేశప్రజల జీవన స్థితిగతులు నేటికీ అధోగతిలోనే ఉంటున్నాయనే నిజాన్ని విస్మరించడం సముచితం కాదు!

### 3 లక్షల మందికి పైగానే అన్నదాతల ఆత్మహత్యలు

దేశంలో రానురాను అనేకరకాల సమస్యలు మరింత జటిలంగా మారుతున్నాయి. ఆధునిక పరిజ్ఞానం బాగా పెరుగుతున్నా, సమస్యలు ఎందుకు నివారించుకోలేకపోతున్నామో, పేదరికాన్ని ఎందుకు తగ్గించుకోలేకపోతున్నామో ఎవరికీ అర్థం కాని బ్రహ్మపదార్థంగానే ఉంటోంది. నేటికీ దేశంలో కూలిపనులు చేసుకుని బతికే కోట్లాదిమంది పేదలు తినడానికి తిండిలేక నానా అవస్థలు పడుతూనే ఉన్నారు. కష్టపడి పంటలు పండించే రైతులు నానా రకాల సమస్యలతో సతమతమవుతున్నారు. గిట్టుబాటు ధరలు లేక, కుటుంబాలను పోషించుకోలేక, అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణమనుకుంటున్నారు. 2005 నుండి 2020 వరకు చూస్తే, ఈ పదిహేనేళ్ళ కాలంలో మనదేశంలో సుమారు 3 లక్షలా 20వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గణాంకాలు చెప్తున్నాయి. అందులో ఆంధ్ర, తెలంగాణాల్లో ఈ ఆత్మహత్యల సంఖ్య ఎక్కువని, సుమారు 9వేల మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారని అధికారిక లెక్కలే స్పష్టం చేస్తున్నాయంటే, పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఊహించుకోవచ్చు. మళ్ళీ ఈ అయిదేళ్లలో మరెంతగా పెరిగాయో లెక్కలు తీస్తే కానీ తెలియదు.

### నిరుద్యోగులు, విద్యార్థుల బలవన్మరణాలు!

అదేవిధంగా, చదువుకోవాల్సిన వయసులో చదువుకుని, ఇక ఉద్యోగాలు చేయాల్సిన సమయంలో ఉద్యోగాలు దొరక్క, కష్టపడి చదివించిన అమ్మానాన్నలను సైతం పోషించలేక, విధిలేని పరిస్థితుల్లో బలవన్మరణాలకు పాల్పడుతున్న నిరుద్యోగుల సంఖ్య కూడా గణనీయంగానే ఉంటోంది. 2012 నుంచి 2022 వరకు ఒక్క పదేళ్ళ కాలంలోనే భారత్‌లో లక్షా 35వేల మందికి పైగా నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు నిపుణుల నివేదికలు చెప్తున్నాయంటే, 'నిరుద్యోగ పర్వం' ఎందరి జీవితాలను బలితీసుకుంటోందో అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా, మానసిక వత్తిడులు, లేదా కుటుంబ సమస్యలతో దేశంలో ఏటా ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా పెద్దదిగానే ఉంది. 2012 నుంచి 2022 దాకా పదేళ్ళలోనే సుమారు లక్ష మందికి పైగానే విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇలా లక్షలాది మంది ప్రజలు బతకలేక చనిపోతుంటే, వారి జీవన్మరణ సమస్యలను ఎలా పరిష్కరించాలో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు.

### అవినీతే అన్నిటికీ మూలకారణం!

నిజం మాట్లాడుకోవాలంటే, ఈ దుస్థితులన్నిటికీ ప్రధాన కారణం సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న అవినీతే అన్నది జగమెరిగిన సత్యం. స్వార్థం, అవినీతి అన్నవి రెండూ విషవృక్షాల్లా పెరిగిపోతున్నాయి. అవి అన్ని రంగాలకూ విస్తరిస్తున్నాయి. ధనాశతో, ఎవరికి వారు తమ స్వార్థమే పరమావధిగా జీవించేందుకు అలవాటుపడుతున్నారు తప్ప, ఎదుటివారి బాధలను ఎవరూ పట్టించుకోవడం లేదు. మానవత్వం అన్నది ఎప్పుడో కనుమరుగైపోయింది. పూర్వకాలంలో లాగా పాపం పుణ్యం అని ఎవరూ ఆలోచించడం లేదు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ధోరణితో ప్రవర్తిస్తున్నారు.

### పరిస్థితులు మారాలి!

ఇలాంటి సంస్కృతి పోవాలి. మనిషి మారాలి, సమాజం మారాలి. ఈ దుర్గతులన్నీ ఇకనైనా సమసిపోవాలి. అవినీతి, అక్రమాలను అరికట్టేందుకు పాలకులు కొరడా పట్టుకోవాలి. ప్రజలను ప్రకృతినీ దోచుకునే దుర్మార్గుల భరతం పట్టాలి. పేదరికం నిర్మూలనకు, నిరుద్యోగాన్ని నియంత్రించేందుకు, విద్యార్థుల, రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు ఏంచేయాలో నిపుణులతో చర్చించి, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వాలు కార్యాచరణకు సిద్ధం కావాలి. దేశాన్ని పట్టి పీడిస్తూ, ఏళ్లతరబడిగా జటిలమైపోతున్న ఇలాంటి ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపకుండా, మనమెంతో గొప్పగా ఉంటున్నామని అనుకోవడం వల్ల ఎవరికీ ఒరిగేదేమీ లేదు. తినడానికి తిండి, ఉండడానికి గూడు, కట్టుకోవడానికి గుడ్డ సక్రమంగా లేకుండా కోట్లాదిమంది ప్రజలు పడే అవస్థలను గుర్తించి వారిని గట్టెక్కించాలి. అస్తవ్యస్తమైన వ్యవస్థలని గాడిన పెట్టి సక్రమ మార్గంలో నడిపించినప్పుడే ప్రగతి రథం ముందుకు పయనిస్తుంది. లేదంటే "ఇంట్లో ఈగల మోత..బయట పల్లకీల మోత" అన్నట్లుగా ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కి సాగుతుంది..!

- రాజశ్రీ

## జగన్మోహన్‌రెడ్డిది అజ్ఞానమా.. అతి తెలివా!

రాజకీయాలలో మేధావులుంటారు, చాణుక్యులుంటారు. కానీ, వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి లాంటి వాళ్ళు చాలా అరుదుగా ఉంటారనుకుంటాను. 2019లో 151సీట్లిచ్చిన జనం 2024 నాటికి 11సీట్లకి పరిమితం చేసినా జగన్‌రెడ్డికి తెలివి రాలేదేమో అనిపిస్తోంది. ఆయన రాజకీయ నిర్ణయాలు, చేస్తున్న ప్రకటనలు, పర్యటనలు చూస్తుంటే ఆయనది అజ్ఞానమా, అతితెలివా అన్న అనుమానం కలుగుతోంది. తాజాగా ఆయన గారు తెనాలికి వెళ్ళి పోలీసుల చేత దండింపబడ్డ ఒక రౌడీషీటర్ కుటుంబాన్ని పరామర్శించడం జగన్‌రెడ్డి రాజకీయ అపరిపక్వతకు అద్దంపడుతోంది. గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు దుండగుల(రౌడీషీటర్లు కూడా)ని అడ్డుకున్న పోలీసు కానిస్టేబుల్‌ని ఆ ముగ్గురూ తీవ్రంగా గాయపరచి తప్పించుకున్నారు. ఆ తరువాత పోలీసులు వారిని గుర్తించి పట్టుకుని బహిరంగంగా దండించారు. ఇదీ తెనాలిలో జరిగిన సంఘటన. దీనికి కూడా రాజకీయ రంగు పులిమి దళితులపై దాడి అంటూ ప్రకటించి ఆ దళితుడికి పరామర్శ అంటూ మాజీ ముఖ్యమంత్రి స్థాయిలో జగన్ తెనాలికి వెళ్ళడం విడ్డూరంగా ఉంది. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి వైసీపీ నాయకుడికి ఇంతకంటే చండాలమైన సాకు దొరకలేదా అన్న అనుమానం కలుగుతోంది. 'రాజకీయాలకి కాదేదీ అనర్హం' అనడానికి ఈ పరామర్శ సంఘటనే ఉదాహరణ..!

జీ.వీ.సుబ్బయ్య - పిడుగురాళ్ళ.

## మహదానంద పండుగగా మహానాడు!

మే27 నుండి 29వరకూ మూడురోజుల పాటు కడప గడపలో జరిగిన తెలుగుదేశం మహానాడు సంబరాలు ఆ పార్టీ అగ్రనేతలు, ద్వితీయ స్థాయి నాయకులు, క్షేత్రస్థాయి కార్యకర్తల క్రమశిక్షణకి, అంకితభావానికి అద్దం పట్టాయి. లక్షలాది మంది పాల్గొన్న వేడుకలలో ఎక్కడా చిన్న అపశృతి కూడా జరగలేదు. ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు కనపడలేదు. వచ్చిన వారు ఏ స్థాయి వారైనా వారెవరికీ ఎక్కడా చిన్న అసౌకర్యం కూడా కలగలేదు. వందలాది మంది ఆశీనులైన వేదికపైన గందరగోళానికి తావులేదు. అధినాయకుడు సమర్థుడైతే, ఆయన నాయకత్వం సమర్థనీయమైనదైతే ఆ పార్టీ చేపట్టే ఏ కార్యక్రమమైనా ఎలా ఉంటుందనడానికి మొన్నటి మహానాడు ఓ ఉదాహరణ. గత అన్ని మహానాడులతో పోలిస్తే ఈ మహానాడు ఓ మహాఘట్టం అని చెప్పడానికి సంకోచం అవసరంలేదన్నది నా అభిప్రాయం.

- పచ్చా పెంచలనాయుడు, పొదలకూరు.




## పెద్దాసుపత్రిలో పనిచేయని యంత్రాలు!

నెల్లూరు సర్వజన పెద్దాసుపత్రిలో పరిస్థితి దయనీయంగా ఉంది. ఆసుపత్రికి అనుబంధంగా వైద్యకళాశాల కుడా ఉండడంతో వసతులు మెరుగవుతాయని భావించిన వారికి నిరాశే ఎదురవుతోంది. ఆసుపత్రిలో వైద్యులకు కరువు లేదు. సిబ్బందికి ఇబ్బందిలేదు. వసతులకి ఢోకా లేదు. వచ్చిన చిక్కల్లా పని చేయని యంత్రాలతోనే. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు సక్రమంగా పని చేయడంలేదు. కొన్ని విభాగాలలో ఈ పరీక్షా యంత్రాలు పనిచేయక పోవడంతో బయటకి వెళ్ళి పరీక్షలు చేయించుకోమని చెప్తున్నారు. సామాన్యులకి ఇది అసాధ్యమైన పని. వందల రూపాయలు ఖర్చు పెట్టుకుని వివిధ రకాల టెస్టులకి, స్కానింగులకి ప్రైవేట్ సంస్థలని ఆశ్రయించడం పేదవారికి కష్టతరమైన విషయం. అధికారులు తక్షణమే దృష్టిపెట్టి చెడిపోయిన యంత్రాలని బాగుచేయించి రోగులకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నాను.

కే.వీరయ్య - వేదాయపాళెం.

# పాత్రికేయులకు త్వరలోనే అక్రిడిటేషన్లు

## - రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పార్థసారథి -



రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందిస్తామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. 2014లో సీఎం చంద్రబాబు హయంలో 21వేల అక్రిడిటేషన్‌కార్డులు అందిస్తే, గత ప్రభుత్వం కేవలం 12 వేలు మాత్రమే ఇచ్చిందని మంత్రి చెప్పారు. అర్హులైన అందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలనే ఉద్దేశంతో మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ప్రభుత్వం నియమించిందని, పూర్తిగా అధ్యాయనం చేసిన తరువాత మంత్రివర్గ సమావేశంలో చర్చించి వీలైనంత త్వరగా అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ నెల 1న నెల్లూరులో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రాభ్యున్నతే ధ్యేయం :

రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రపథంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సరికొత్త ఆలోచనలతో ముందుకుసాగుతున్నారని మంత్రి పార్థసారథి తెలిపారు. ఈనెల 1న ఆయన నెల్లూరులో జరిగిన యాదవ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, అన్నిరకాలుగా విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పయనింపచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశాన్ని, విజన్ 2047 ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచంలో ఉన్నతస్థానాల్లో నిలిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాయన్నారు. విద్యార్థులు, యువత అందరూ 2047 విజన్ లక్ష్యాలను అందుకునేందుకు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# దివ్యాంగులకు అండగా ఉంటాం!

## - నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి



దివ్యాంగుల కళ్లలో ఆనందం చూసేందుకు.. వారికి తోడుగా నిలుస్తూ.. ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ళను అందజేస్తున్నామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) చెప్పారు. ఈనెల 4న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 100 మంది దివ్యాంగులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డిలతో కలిసి ఆయన దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో జీవించేందుకు వారికి తమ వంతు చేయూతగా వాటిని అందజేస్తున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా తాను ఉదయగిరి ప్రాంతంలో ప్రచారం చేస్తున్నప్పుడు, ఆయా గ్రామాల్లోని దివ్యాంగులను చూసి చలించిపోయానని, వారికి సాయం చేయాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 850 మందికి ట్రై సైకిళ్లు అందించామన్నారు. ట్రై సైకిళ్ల నిర్వహణ కూడా ఫౌండేషన్ తరఫునే చేపడతామని, ఎక్కడ ఇబ్బందులు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంకా ఎవరికైనా ట్రై సైకిళ్ళు అందాల్సి ఉంటే, తమకు తెలియజేయాలని ఆయన కోరారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు పార్లమెంట్ సభ్యులుగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఉండటం ప్రజల అదృష్టమన్నారు. పార్లమెంట్ పరిధిలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 100మంది దివ్యాంగులకు వారు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందించడం గొప్ప విషయమన్నారు. ఎంపీ అనే పదవికి విపిఆర్ వన్నె తెచ్చారని, ఆయనకు భగవంతుడి ఆశీస్సులు మెండుగా ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జడ్ శివప్రసాద్ మాట్లాడుతూ.. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ కార్యక్రమం చేపట్టడం రాజకీయాల కోసం కాదని, రాజకీయాల్లోకి రాకముందు నుంచే వారు ప్రజలకోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. వారందిస్తున్న సహాయ సహకారాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# జనసేనకు నాయకుల విరాళాలు

రాష్ట్ర టిడ్కో చైర్మెన్ వేములపాటి అజయ్‌కుమార్ సూచనల మేరకు జనసేన పార్టీకి నెల్లూరుజిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు విరాళాలందించారు. నెల్లూరుకు చెందిన నూనె మల్లికార్జునయాదవ్ లక్ష రూపాయలు విరాళం ఇవ్వగా, సర్వేపల్లి నియోజకవర్గ జనసేన నాయకుడు బోనుబోయిన ప్రసాద్, సంగం మండలం దువ్వూరుకు చెందిన చదలవాడ సురేష్, వెంకటగిరి నాయకులు అనిల్ రామారావు కలసి మరో మూడు లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఆ చెక్కును ఈనెల 2న మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్సీ నాగబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, కాకు మురళీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవి, కృష్ణారెడ్డి, కిషోర్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.




# నెల్లూరు కబుర్లు

## ప్రజలకు ఏం కావాలో.. అదే చేద్దాం

**మంత్రి నారాయణ**



తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు ఏం కావాలో అదే చేయాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. నెల్లూరు నగరాన్ని అన్ని విధాల సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. ఇటీవల నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో నగరపాలక సంస్థ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజల అభీష్టానికి అనుగుణంగా ఇంకా చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వర్షపు నీరు కాలువల్లో ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్‌కి..కొత్త డిప్యూటి కమిషనర్

జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా ఎం. శంకరయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 2న ఉత్తర్వులిచ్చింది. ఆయన విజయనగరం ఏసీగా, సెబ్‌లో విజయవాడ డీసీగా విధులు నిర్వహించి, ప్రస్తుతం ఆశాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. నెల్లూరులో డీసీ స్థానంలో పనిచేస్తున్న టి.శ్రీనివాసరావు గత నెల 31న పదవీ విరమణ చేయడంతో, శంకరయ్యను కొత్త డిప్యూటి కమిషనర్‌గా నియమించారు.

## బులియన్ మర్చంట్స్.. అధ్యక్షునిగా శాంతిలాల్



నెల్లూరు జిల్లా బులియన్-డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఈనెల 1న ఎన్నుకున్నారు. నెల్లూరు, ఆచారివీధిలో ఉన్న క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ సమావేశమందిరంలో జరిగిన ఆ సంఘం కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. శాశ్వత అధ్యక్షునిగా శాంతిలాల్ జైన్ ఎన్నిక కగా, శాశ్వత నిర్వహణ కార్యదర్శిగా మణిలాల్ జైన్, ఉపాధ్యక్షులుగా జేవెల్ సత్యం, ప్రధాన కార్యదర్శిగా ఆర్కాట్ శ్రీనివాసులు, కోశాధికారిగా కైలాశ్‌జైన్, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్ జైన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కన్వీనర్‌గా జి.కిషోర్‌కుమార్, సలహాకమిటీ సభ్యులుగా జి.శంకర్‌లాల్ జైన్, డి.ప్రభాకర్, అలిమెలి సుబ్రహ్మణ్యం, ఎంపీ ఆంజనేయులు, ఫయాజ్ ఎన్నికయ్యారు. మూడేళ్ళ పాటు ఈ కమిటీ బాధ్యతలు నిర్వహిస్తుందని, ఇతర కార్యవర్గ సభ్యులను కూడా త్వరలోనే ఎన్నుకుంటామని సంఘం నిర్వాహకులు తెలిపారు.

## గాయత్రి చదువుకు.. ప్రశాంతమ్మ చేయూత



అసలే నిరుపేద కుటుంబం. రోడ్డు ప్రమాదంలో తండ్రి చనిపోయాడు. చిన్న అంగడి పెట్టుకొని కాపురాన్ని నెట్టుకొస్తున్న తల్లికి..ఆమె కుమార్తె చదువు భారంగా మారిన పరిస్థితులలో విపిఆర్ ఫౌండేషన్ ఆపన్న హస్తం అందించింది. ఆమెకు 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించింది. నెల్లూరునగర శివార్లలోని కనుపర్తిపాడు ఇందిరమ్మ కాలానికి చెందిన పి.గాయత్రి విపిఆర్ విద్యాసంస్థలో 10వ తరగతిలో 587 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకున్న విషయం తెలిసిందే. గాయత్రి తండ్రి కృష్ణారావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, గాయత్రిని ఉన్నత చదువులు చదివించాలంటే వేలకు వేలు ఫీజులు చెల్లించే ఆర్థిక స్తోమత ఆమె తల్లికి లేదు. 10వ తరగతి వరకు గాయత్రికి ఉచిత విద్య అందించిన విపిఆర్ ఫౌండేషన్ ద్వారానే, ఇంటర్మీడియట్ చదువుకు కూడా ఆర్థిక సహాయం అందించాలని కోరిన గాయత్రి తల్లి దయనీయ పరిస్థితిని చూసి చలించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గాయత్రికి ఫీజు తదితర ఖర్చులకు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.50 వేల చెక్కును అందించడం విశేషం. దీంతో గాయత్రి, ఆమె తల్లి.. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఔదార్యానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు



ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్‌తో పర్యావరణానికెంతో హాని కలుగుతుందని, ప్లాస్టిక్ వ్యర్థాలు పెనుముప్పుగా తయారవుతున్నాయని, అందువల్ల వాటి వాడకానికి దూరంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 2న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ప్రమాదకరంగా పరిణమిస్తున్న ప్లాస్టిక్‌ని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా రూపొందించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారి అశోక్‌కుమార్, డిఆర్ఓ ఉదయభాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 12న..జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

నెల్లూరు జిల్లా పరిషత్తు స్థాయీ సంఘాల సమావేశాలు జూన్ 12న జరుగనున్నాయి. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నేతృత్వంలో ఆరోజు ఉదయం 10 గంటల నుంచి ప్రణాళిక, ఆర్థిక, పనుల తీరు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర అంశాలపై చర్చలు జరుగనున్నాయని, జడ్పీ సభ్యులు, జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొనాలని జడ్పీ సీఈఓ విద్యారమ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



## ఐఐటి అడ్వాన్స్డ్ ఫలితాల్లో..

## డా. కిషోర్స్ రత్నం విద్యార్థుల విజయకేతనం

ఇటీవల విడుదలైన ఐఐటి అడ్వాన్స్డ్ ఫలితాల్లో నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలు నిరూపించుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించారు. తమ కళాశాల మొదటిబ్యాచ్‌కి చెందిన పి.సాయివర్షిల్‌రెడ్డి, జనరల్ కేటగిరీలో ఐఐటి సీటును సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా, 9 మంది విద్యార్థులు..ఎన్ తిలక్‌వర్మ, జె.ప్రశాంత్, కె.నిహారిక, వై.తినేష్, పి.మహీధర్, ఎం.త్రిషాంత్, ఎం.తేజోను, ఏ.యోగేష్‌లు ఎన్ఐటిలో సీట్లు సాధించారని వారు తెలిపారు. పటిష్టమైన విద్యాప్రణాళిక, విశిష్టమైన విద్యాబోధన, నిపుణులైన అధ్యాపక బృందం, నిరంతర కృషి ఈ విజయాలకి సోపానాలని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అద్భుత విజయాలు సాధించిన విద్యార్థులను డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్, రోషిణి, ఈశ్వర్‌లు అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు, ప్రిన్సిపాల్స్‌కి, అధ్యాపకేతర బృందానికి వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, అకడమిక్ అడ్వయిజర్ నరసయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సాయిదర్బార్‌లో..శ్రీ వేంకటేశ్వరుని కల్యాణం



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 1న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. సాయిదర్బార్ 20వ వార్షికోత్సవం సందర్భంగా, ఆలయ నిర్వాహకులు మధుసాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తొలుత స్వామివారికి, అమ్మవార్లకు విశేష పుష్పాలంకరణలు చేసి, వేదపండితులు వేదగిరి ఫణిశర్మ, దాశరథి నేతృత్వంలో వేదమంత్రాలు, మంగళవాద్యాల మధ్య కల్యాణం కమనీయంగా నిర్వహించారు. కోలాటాలు, పండరిభజనలతో, గోవింద నామస్మరణలతో ఈ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, బాబీ, సాయిభక్తులు పాల్గొన్నారు.

## గ్రంథాలయోద్యోగుల బదిలీలు

జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. నెల్లూరులో డిప్యూటీ లైబ్రేరియన్‌గా ఉన్న ప్రసాద్‌ను గూడూరుకు బదిలీ చేస్తూ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ సంచాలకులు ఈనెల 3న ఆదేశాలిచ్చారు. అదేవిధంగా, కావలిలో పనిచేస్తున్న ఎస్.సునీతను నెల్లూరులో డిప్యూటీ లైబ్రేరియన్‌గా, ఒంగోలులో పనిచేస్తున్న పి.కోటేశ్వరిని కావలికి, సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆర్.కుమార్‌ను గుంటూరుకు, గుంటూరు నుంచి ఎం.సీతారామయ్యను నెల్లూరుకు బదిలీ చేశారు.

## స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణిగా.. మళ్ళీ హేనా సుజన్

గతంలో నెల్లూరుజిల్లాలో స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారిణిగా పనిచేసి బదిలీ అయిన హేనా సుజన్‌ను రెండోసారి ఇక్కడే అధికారిణిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 2న ఆదేశాలు జారీచేసింది. ఈ స్థానంలో పనిచేస్తున్న సువర్ణ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోండి

వైఎస్ఆర్ కడపజిల్లా పుట్లంపల్లిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5 తరగతుల్లో చేరేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను పంపుకోవాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కె యతిరాజ్ ఈనెల 3న ఒక ప్రకటనలో కోరారు. వివరాలన్నీ ఏపీ స్పోర్ట్స్‌స్కూల్ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని, ఈనెల 16వ తేదీలోగా తమ దరఖాస్తులను పంపుకోవాలని ఆయన సూచించారు.






### 65 ఏళ్లు నిండిన వారికి

## ఇంటివద్దకే రేషన్

**ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్**

అరవై అయిదేళ్ళు నిండిన వారికి ఇంటివద్దకే డీలర్ వచ్చి రేషన్ ఇస్తారని, అదేవిధంగా దివ్యాంగులకు కూడా ఇంటివద్దకే రేషన్ ఇచ్చే ఏర్పాట్లు చేశామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఈనెల 3న ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ షాపు డీలరే మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటలలోగా వారి ఇళ్లవద్దకు వెళ్ళి రేషన్ అందజేస్తారని, డీలరు వస్తున్నట్లు ఫోన్‌లో ముందస్తు సమాచారం కూడా ఇస్తారని పేర్కొన్నారు. జిల్లాలో 89వేల మంది వరకు వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారని, ఇప్పటివరకు 55 శాతం మందికి రేషన్ సరుకులు అందజేయడం జరిగిందని ఆయన తెలియజేశారు.

# వీర్లగుడిపాడుకు త్వరలోనే మహర్దశ

## ○ 25 కోట్లతో రోడ్డు-వంతెన నిర్మిస్తామన్న మంత్రి ఆనం



ఆత్మకూరు నియోజకవర్గంలోని వీర్ల గుడిపాడు గ్రామపంచాయతీలో ఇటీవల రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల గ్రామమైన వీర్లగుడిపాడు గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలోని రోడ్లన్నిటిని కూడా సిమెంట్ రోడ్లుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. దీంతో వీర్లగుడిపాడు గ్రామానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. ఏడు కిలోమీటర్ల మేర తారురోడ్డు, బ్రిడ్జి నిర్మించేలా అధికారులు ప్లాన్ రూపొందించారని, త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు-వంతెనల నిర్మాణానికి ఆమోదం తీసుకుని, త్వరలోనే పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నిర్మాణాల వల్ల గ్రామం నుంచి నేరుగా సంగంకు చేరుకునేలా రాకపోకలు సులభతరమవుతాయని, గ్రామానికి ఇతర ప్రాంతాల నుంచి అనుసంధానం పెరుగుతుందని మంత్రి తెలిపారు.

# జగన్‌లో..ఇక మార్పు రాదేమో!



\- సోమిరెడ్డి

మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెనాలిలో రౌడీషీటర్లను పరామర్శించడం ఏమిటి?.. ఇక ఆయనలో మార్పు రాదేమో.. అని మాజీమంత్రి, తెలుగుదేశం నాయకుడు.. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరులో ఆయన ఇటీవల మాట్లాడుతూ, ఏడాది క్రితం ప్రజలిచ్చిన చరిత్రాత్మక తీర్పు నుంచి జగన్ ఇంకా గుణపాఠం నేర్చుకోలేదన్నారు. ముఖ్యమంత్రి పదవికి ఎలాగూ వన్నె తేలేకపోయినా, మాజీ ముఖ్యమంత్రి అనే గౌరవాన్ని కూడా కాపాడుకోలేకపోతున్నాడని దుయ్యబట్టారు. తెనాలిలో రౌడీషీటర్లకు పోలీసులు ఇచ్చిన ట్రీట్‌మెంట్‌ను రాష్ట్రమంతా హర్షిస్తోందని, శాంతిభద్రతలను కాపాడేందుకు అలాగే కఠినంగా వ్యవహరించాలని కోరుకుంటోందని అంటూ, జగన్‌రెడ్డి మాత్రం గంజాయి గ్యాంగులు, బ్లేడ్ బ్యాచ్‌లకు, ఆడబిడ్డలను వేధించిన వారికి అండగా ఉంటాననడం సిగ్గుచేటన్నారు. 9 కేసుల్లో నిందితులు, రౌడీ షీటర్లయిన వారిని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి తెనాలికి వెళ్ళడం దారుణమన్నారు. జగన్‌రెడ్డి చేష్టలన్నీ విచిత్రంగా ఉంటున్నాయని, వైకాపా అధికారంలో ఉన్నప్పుడు సొంతపార్టీ ఎంపీని పోలీసులతో కొట్టించి, లైవ్‌లో చూస్తూ పైశాచిక ఆనందం పొందారని, ఇప్పుడేమో రౌడీషీటర్లపై పోలీసులు చర్యలు తీసుకుంటే, పరామర్శ పేరుతో రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. 11 సీట్లకు పరిమితమైనా రాని మార్పు..ఇక భవిష్యత్తులోనైనా వస్తుందనుకోవడం అనుమానమేనని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు.

# విద్యార్థులను ఆకట్టుకున్న.. శ్రీసిటీ వేసవి విజ్ఞాన శిబిరం

## ● వివిధ అంశాల్లో బాలలకు శిక్షణ



ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామికవాడ.. శ్రీసిటీలో వేసవి శిబిరం (సమ్మర్ క్యాంపు) ఏర్పాటుచేసి విద్యార్థులకు పలు అంశాల్లో నైపుణ్య శిక్షణతో పాటు వినోదం, ఆహ్లాదాన్ని కలిగించారు. స్థానిక ఈఎంసి సమావేశ మందిరంలో ఇటీవల జరిగిన ముగింపు వేడుకలో విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఉచిత భోజనం, వాహన వసతితో పాటు వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేసిన శ్రీసిటీ యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 9 నుంచి మే 30 వరకు 40 రోజుల పాటు జరిగిన ఆ శిబిరంలో 9, 10, 11వ తరగతుల్లో పరీక్షలు పూర్తైన విద్యార్థులు 175 మంది హాజరు కాగా, వారిలో 50 మంది చివరివరకు పాల్గొన్నారు. శిక్షణలో స్పోకెన్ ఇంగ్లీష్, గణిత సూత్రాలు, బేసిక్ కంప్యూటర్ కోర్సు, వ్రాత నైపుణ్యాలు, పోటీ పరీక్షల మెళకువలు, జనరల్ నాలెడ్జి, ప్రపంచ వార్తలు తదితర అంశాలను బోధించారు. యోగా, కరాటే, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, మరికొన్ని క్రీడలలో వారికి తర్ఫీదునిచ్చారు. అంతేకాదు, క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్‌లు నిర్వహించి వారిని విజ్ఞానపరంగా చైతన్యవంతం చేశారు. ఫైర్ సేఫ్టీ, ప్రాథమిక ఆరోగ్య చికిత్సల పట్ల ప్రత్యక్ష అభ్యసన ద్వారా అవగాహన కలిగించారు. తిరుపతిలోని జంతు సంరక్షణ కేంద్రం, సైన్స్ సెంటర్ క్షేత్ర పర్యటనలు మరియు శ్రీసిటీలోని పెప్సీ, వైటల్ పేపర్స్ పరిశ్రమలు, నర్సరీ సందర్శనలకు విద్యార్థులను తీసుకెళ్లారు. శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి వివిధ కోర్సులతో ఈ కార్యక్రమాన్ని రూపొందించి వారికి మార్గనిర్దేశం చేశారు. వేసవి సెలవులను గ్రామీణ విద్యార్థులు వృధా చేయకుండా వారికి విజ్ఞానం, నైపుణ్య శిక్షణ అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన వేసవి శిబిరం విజయవంతం కావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ అధ్యాపక బృందంలో రంజిత (క్రాఫ్ట్), దుష్యంత్ (పోటీ పరీక్షలు), ఉమా, నేహా (వ్యక్తిత్వ అభివృద్ధి), సాయి లక్ష్మి (ఇంగ్లీష్), సౌమ్య (కంప్యూటర్లు), కోదండం (యోగా మరియు కరాటే), క్రీడా సెషన్లకు మ్యాజిక్ బస్ ఫౌండేషన్ నిపుణులు వేసవి శిబిరం శిక్షకులుగా వ్యవహరించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, డాక్టర్ సులోచన, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.








## మాగుంట శీనయ్యకు అభిమానుల శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావడం, అదే విధంగా టీడీపీ ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎన్నికై తొలి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ఆయన అభిమానులు కేక్‌ను కట్ చేసి శీనయ్యకు, కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

# కేంద్రం నిర్ణయంపై విపిఆర్ హర్షం

## 3653 కోట్లతో బద్వేల్-గురివిందపూడి హైవే అభివృద్ధి



బద్వేల్ నుంచి గురువిందపూడి జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా అబివృద్ధి చేసేందుకు కేంద్ర మంత్రిమండలి ఇటీవల నిర్ణయం తీసుకోవడం పట్ల నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్) ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 3653 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ 4లేన్ల హైవే నిర్మాణానికి సహకరిస్తున్న ప్రధాని మోదీకి, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి తన కృతజ్ఞతలు తెలిపారు. 108 కిలోమీటర్ల ఈ రహదారి వల్ల జిల్లాలోని కృష్ణపట్నం పోర్ట్‌కు ప్రయాణ దూరాన్ని సగానికి తగ్గించవచ్చని, రాష్ట్రంలోని 3 ప్రధాన పారిశ్రామిక కారిడార్లను ఈ జాతీయ రహదారి కలుపుతుందని విపిఆర్ వివరించారు.

## భానుప్రకాష్‌కు అభినందనలు



నెల్లూరుజిల్లా అల్లూరు మండలం ఇందుపూరులో పుట్టి, కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన ఏటూరు భానుప్రకాష్‌కి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. తన సొంత గ్రామమైన ఇందుపూరు నుంచి వెళ్లి, కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్‌గా భానుప్రకాష్ నియమితులు కావడం అభినందనీయమన్నారు.




## జేఇఇ అడ్వాన్స్డ్ ఫలితాల్లో..
# 'విశ్వసాయి' జయభేరి


CH SAI ROOPESH


G KAILASH REDDY

ఇటీవల ప్రకటించిన 2025 – జేఇఇ అడ్వాన్స్డ్ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వ సాయి జూనియర్ కళాశాలకి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ సత్తా చాటారు. సిహెచ్ సాయిరూపేష్ జాతీయ స్థాయిలో 2298వ ర్యాంకు, జి.కైలాష్‌రెడ్డి 3391వ ర్యాంకు, యు.కుష్వంత్‌కుమార్ 10708వ ర్యాంకు సాధించడం విశేషం.

విద్యార్థుల నిరంతర కృషి, అధ్యాపకుల పర్యవేక్షణ ఈ విజయాలకు కారణమని విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా.ఎన్.సత్యనారాయణ తెలిపారు. విశ్వసాయి విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయిలో విశేషప్రతిభ కనపరచడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ విజయాలను సాధించిన విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తాము రూపొందించి అవలంభిస్తున్న వత్తిడి లేని విద్య, 5 స్టెప్ కార్యక్రమాల ద్వారా ఎంపిసీలో కూడా మంచి ఫలితాలు సాధిస్తున్నామని విద్యాసంస్థల వైస్‌ఛైర్మెన్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ విజయ పరంపర భవిష్యత్తులో అన్ని పోటీ పరీక్షల్లో కూడా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వసాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# జగనన్న కాలనీల్లో..అన్నీ అవకతవకలే
## - ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆరోపణ

గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో అవకతవకలు జరిగాయంటూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని 7, 8, 9 వార్డులలో ఇటీవల నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం సందర్భంగా ఆమె ఇల్లిల్లూ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగనన్న కాలనీలలో సామాన్యులకు ఇంటి స్థలాలు ఇవ్వకుండా వైసిపి నేతలే అమ్ముకున్నారని ఆమె ఆరోపించారు. కోవూరు నియోజకవర్గంలో అనారోగ్య పీడితులకు దాదాపు 3 కోట్ల రూపాయల వరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందజేసి మానవత్వం చాటుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని ఆమె కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ఆమె ఈ సందర్భంగా ప్రజలకు



వివరించారు. ఈనెల 12న ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని, ఆగస్టు నాటికి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయనుందన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చి పట్టణ కమిషనర్ బాలకృష్ణ, ఎంపీడీవో శ్రీహరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ ఛైర్మెన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, నశ్రీన్ ఖాన్, కౌన్సిలర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## చాముండేశ్వరిదేవికి.. చప్పర ఉత్సవం

ఇందుకూరుపేట మండలం గంగపట్నంలో కొలువై ఉన్న శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 3న అమ్మవారికి చప్పర ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఇఓ తాతా శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, బ్రహ్మోత్సవ సేవా కమిటీవారు పర్యవేక్షించారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# వియస్ఆర్‌లో స్ఫూర్తిసేవా వైద్య శిబిరం



గూడూరు రెండో పట్టణ పరిధిలోని వియస్ఆర్ పాఠశాలలో స్ఫూర్తి సేవాసమితి ఆధ్వర్యంలో ఇటీవల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించుకొని ఉచితంగా మందులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ పేదప్రజల కోసం స్ఫూర్తి సేవా సమితి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు ఫీజుల్లో కొంత రాయితీ ఇవ్వాలని ఆయన వైద్యులకు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, చదలవాడ హరిప్రసాద్, బాలకృష్ణంరాజు, లక్ష్మీనారాయణ రాజు, నరసరాజు, వెంకటేశ్వర్లు, మస్తాన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.




# అమీర్‌బాషా సేవలు ప్రశంసనీయం
## ఎమ్మెల్యే పాశిం సునీల్



తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్, నెల్లూరు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అమీర్ బాషా మే 31వతేదీ రిటైర్ అయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 1వతేదీ గూడూరు కాస్మో పాలిటిన్ ఫంక్షన్ హాలులో గూడూరు ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్, ఆ శాఖ డిప్యూటీ కలెక్టర్ మురళీల ఆధ్వర్యంలో పదవీ విరమణ శుభాకాంక్షల సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో ఎమ్మెల్యే సునీల్ మాట్లాడుతూ అమీర్ బాషా 40 సంవత్సరాలు రెవెన్యూ శాఖలో ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. గూడూరు ఆర్డీవో కార్యాలయంలో, చిల్లకూరు తహశీల్దార్ కార్యాలయంలో, కోట, మనుబోలు రెవెన్యూ శాఖలలో సీనియర్ అసిస్టెంట్‌గా అమీర్ తన సేవలు అందించి మంచి గుర్తింపు తెచ్చుకోవడమే కాక, ప్రజల మన్నలను పొందారని ప్రశంసించారు. కోట తహశీల్దార్ జే.జే.రావు, మనుబోలు, గూడూరు, కోట, చిల్లకూరు నాయకులు, కోడూరు మీరారెడ్డి, నెల్లటూరు భాస్కర్‌రెడ్డి, మనుబోలు ఏఎంసి ఛైర్మెన్ దాలి రామకృష్ణారెడ్డి, జట్లకొండూరు సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, అమీర్‌బాషా కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# అర్హులకు ఇళ్ళ స్థలాలివ్వండి



అర్హులైన నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలంటూ ఈ నెల 2వ తేదీ గూడూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయం నుండి ఆ పార్టీ నాయకులు ప్రభాకర్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.



# జనసేన సభ్యత్వ కిట్ల పంపిణీ

జనసేన క్రియాశీల సభ్యత్వం తీసుకొన్న కార్యకర్తలకు గూడూరు పట్టణంలోని సీఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో ఈ నెల 2వ తేదీ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు కె.మునిగిరీష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడిన జనసైనికులకి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మంచి ఆలోచనతో రూ.5లక్షల ప్రమాద బీమా, వైద్య ఖర్చులు రూ.50వేలు అందించే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. నాయకులు పేటేటి చంద్రనీల్ నయీమ్, ఇంద్రవర్ధన్‌కుమార్, బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శిశు మందిరంలో అదనపు గదులు



గూడూరు సరస్వతి శిశు మందిరంలో అదనపు గదుల నిర్మాణానికి ఈ నెల 4వ తేదీ మయూరి శ్యాంయాదవ్ దంపతులు భూమిపూజ చేశారు. డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, ఎమ్.మురళీరెడ్డి, కె.రామమూర్తి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# మలేరియాపై అవగాహన ర్యాలీ

గూడూరు పురపాలక సంఘం పరిధిలోని చెన్నూరు పిహెచ్‌సి ఆధ్వ ర్యంలో మలేరియా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 3న అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ మలేరియా పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. డాక్టర్ లీలాకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ మస్తానయ్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో... పొగాకు వ్యతిరేక దినోత్సవం

మే 31వ తేదీ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గూడూరు ఏరియా ఆసుపత్రిలో పొగాకు వ్యతిరేకంగా ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించి పొగాకు పీల్చడం వల్లే కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. షరీనా, వైద్యులు మోహన, ప్రసన్న, సోషల్ వర్కర్ లలిత, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# అసలు రంగు బయటపెట్టేసుకున్న జగన్



వైకాపా అధినేత జగన్ మంగళవారం తెనాలి పర్యటనతో ఆయన స్వభావం, రాజకీయ అజెండా తేటతెల్లమయిపోయింది. అసాంఘిక శక్తులు తనకు ఎంత ముఖ్యమో తన పర్యటన ద్వారా, అక్కడ చేసిన ప్రసంగం ద్వారా స్పష్టంగానే తెలియచెప్పారు. వయసులో ఉన్నప్పుడు తప్పులు చేస్తారు, కేసులుంటాయి.. అంత మాత్రాన పోలీసులు కొడతారా అన్నట్లు జగన్ ప్రసంగం ఉంది. తెనాలిలో పోలీసులు అరికాలి కోటింగ్ ఇచ్చిన ముగ్గురు యువకులకు సచ్చరిత్ర ఏమీ లేదు. లడ్డూ అనే రౌడీ షీటర్ అనుచరులని అందరూ చెబుతున్నారు. ఆ ముగ్గురూ మద్యం తాగుతూ పోలీసు కానిస్టేబుల్‌పై దాడి చేశారని పోలీసులు అంటున్నారు. ఆ దాడిపై కేసు నమోదయింది. వారిలో ఒకరిపై రౌడీషీట్ ఉందని, మిగిలిన ఇద్దరిపైనా కేసులున్నాయని పోలీసులు వివరిస్తున్నారు. తమ డిపార్ట్‌మెంట్ వ్యక్తినే కొట్టడంతో అరికాలి మంట నెత్తికెక్కిన పోలీసులు అరికాలి కోటింగ్ ఇచ్చినట్లు అర్థమవుతోంది. అలాంటి వారికి పోలీస్ ట్రీట్‌మెంట్ సరైనదే అన్న సమర్థింపులు చాలామంది నుంచి వచ్చాయి. అయితే, ఇలా చట్టాన్ని పోలీసులు చేతిలోకి తీసుకోవడం చట్టపరంగా తప్పే. కోర్టుకు అప్పచెబితే తగిన శిక్ష పడేది.

నూతక్కి రవికిరణ్ అనే దళిత యువకుడిని లడ్డూ, అతని అనుచరులే హత్య చేసినట్లు రవికిరణ్ తల్లి ఆరోపిస్తున్నారు. కుమారుడి భౌతిక కాయం కూడా దొరకక ఆ తల్లి పడిన ఆవేదన అంతాఇంతా కాదు. అప్పటి శాసనసభ్యుడిని ఎంత వేడుకున్నా తమకు న్యాయం జరగలేదని ఆ తల్లి రోదిస్తూ చెబుతుంటే ఎవరికైనా ఆవేదన కలగక మానదు. వైకాపా పాలనలో వైద్యుడయిన డాక్టర్ సుధాకర్.. విధుల్లో భాగంగా మాస్కులు అడిగిన పాపానికి ఆ పార్టీ నేతలు, అప్పటి పోలీసులు ఎంతటి మానసిక వేదనకు గురి చేశారో అందరికీ తెలుసు. ఆ వేదనతోనే ఆయన మరణించారు. ఆయనపై అప్పటి ప్రభుత్వ పెద్దల ప్రోద్బలంతో పిచ్చివాడని ముద్ర వేశారు. ఆ వైద్యుడు కూడా దళిత వర్గానికి చెందినవారే. ఆ వైద్యుడి తల్లి ఎంత తల్లడిల్లిపోయారో జగన్‌కు తెలియదా? వైకాపా హయాంలో ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్ సుబ్రమణ్యాన్ని హత్యచేసి భౌతిక కాయాన్ని డోర్ డెలివరీ చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. సుబ్రమణ్యం కూడా దళిత వర్గానికి చెందినవారే. సుబ్రమణ్యం కుటుంబానికి జగన్ చేసిన న్యాయం ఏమిటి? రాజమహేంద్రవరంలో ఇసుక మాఫియాను నిలదీసినందుకు వరప్రసాద్ అనే వ్యక్తికి శిరోముండనం చేశారు. ఆ సంఘటనలపై ఆనాడు జగన్ స్పందించలేదు. వారెవరినీ పరామర్శించలేదు.

మనసులో మాట 48

నిజానికి మానవత్వానికి, కులానికి సంబంధం లేదు. దళితులైనా, మరే కులమయినా అందరం చూడాల్సింది మానవత్వాన్నే. ప్రతి కులంలోనూ మంచివారుంటారు, చెడ్డవారుంటారు. కానీ మానవత్వాన్ని మంటగల్పుతున్న వారినే జగన్ వెనకేసుకొస్తున్నారు. పరామర్శిస్తున్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ప్రతి నియోజకవర్గంలోనూ ఆ పార్టీ అనుకూల రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు పేట్రేగిపోయారు. వారు అంతలా రెచ్చిపోతున్నా అప్పట్లో పోలీసులు చూస్తూ ఊరుకున్నారు. ఆ అరాచక శక్తులకు వైకాపా పెద్దల నుంచి అన్ని రకాల అండదండలుండడంతో ఏమీ చర్యలు తీసుకోలేదు. అదే రౌడీషీటర్లకు అలుసయిపోయింది. పోలీసులంటే చులకన ఏర్పడి వారిపైనే దౌర్జన్యం చేసే పరిస్థితి వచ్చింది. ఇటీవల వైకాపా నేత జోగి రమేశ్ ఇంట్లో శుభకార్యానికి వెళ్లిన ఆ పార్టీ కార్యకర్తలు కొందరు రోడ్డుపై సైకిల్‌తో వెళ్తున్న బాలుడి వద్ద సైకిల్ లాక్కొని చేసిన వీరంగం కూడా అందరూ చూశారు. ఆ బాలుడు భయంతో బిక్కచచ్చిపోయాడు. జగన్ తెనాలి పర్యటనలో ఒక వ్యక్తి పోలీసు వాహనంపైకి ఎక్కి చిందులు వేయడం అందరూ చూశారు.

వైకాపా అధికారంలో ఉన్నప్పుడు పార్టీలోని ఇతర నేతల ద్వారా అరాచకశక్తులకు, రౌడీషీటర్లకు అండదండలు అందించిన జగన్.. ఇప్పుడు నేరుగానే తన మనసులో మాటను బయటపెట్టేశారు. సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిని, గంజాయి రవాణా చేస్తూ యువతరాన్ని మత్తుకు బానిసలుగా చేస్తూ ఎన్నో కుటుంబాల్లో వేదనకు కారణమవుతున్నవారిని వెనకేసుకు రావడం ద్వారా అసలు రంగును బయటపెట్టేసుకున్నారు. జగన్ వైఖరిని దళితులు బాగానే అర్థం చేసుకున్నారు. అందుకే తెనాలిలో ఆయన పర్యటనకు దళిత సంఘాలు, ప్రజాసంఘాల నుంచి తీవ్ర నిరసన ఎదురయింది. రౌడీషీట్లు ఉన్న వారిని, పోలీసులను కొట్టిన వారిని ఎలా పరామర్శిస్తారని ప్రశ్నిస్తూ నిరసన తెలియజేశారు. కేసులకు భయపడవద్దు, నేను అధికారంలోకి వచ్చిన తర్వాత అంతా చూసుకుంటాను అనడం ద్వారా జగన్ ఏమి సందేశం ఇస్తున్నట్లు? ఇలాంటి రాజకీయాలతో రాష్ట్రానికి ఏమి ప్రయోజనం కలుగుతుంది? ప్రజలు ఇచ్చిన తీర్పును అనుసరించకుండా, వారు సూచించిన పాత్రను పోషించకుండా జగన్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై చర్చించకుండా అసాంఘిక శక్తులకు మద్దతు పలుకుతున్నారు. ప్రజలంతా ఆలోచించాల్సిన విషయమిది.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**



# జానకిరామ.. రామాయణం 68

- ఊటుకూరు జానకి రామారావు



ఓ నదీనదాలలారా నా సీత ఎక్కడ? జవాబీయరేమి? ఇవిగో ఈ నిశిత శరాలు మీ నీరు ఆవిరి చేసి మిమ్ములను శాశ్వతంగా ఎండిపోయేటట్లు చేస్తాయి.

అని బిగ్గరగా అరుస్తూ ఉన్మాదియై నడుస్తున్న రామునకు హఠాత్తుగా భూమి మీద ఒక పెద్ద కాలి అడుగు, దాని వెంట సీత కాలి అడుగు, ఆవిడ అడుగులు మరియు వాటి వెంట అతిపెద్ద కాలి అడుగులు వెంబడించి పరుగెత్తినప్పుడు ఏ విధంగా అడుగుల ముద్రలుంటాయో ఆ విధంగా కనపడ్డాయి.

ఇంకొకవైపు విరిగిన ధనుస్సు ముక్కలు, ధ్వంసమైన రథపు విడిభాగాలు సీతాదేవి అలంకారాల నుండి చిన్నచిన్న బంగారు ముక్కలు చెల్లాచెదురుగా కనపడ్డాయి, ఒక్కసారిగా రాముడి హృదయం గతితప్పింది!

ఆయనకు అక్కడక్కడా రక్తపు చుక్కలు కనపడ్డాయి. అవి చూసి, లక్ష్మణా ఇవి నిశ్చయంగా మీ వొదినను రాక్షసులు భక్షించినారు అనేందుకు చిహ్నాలు సుమా అని మరల బిగ్గరగా రోదించసాగాడు.

మరల చూపు సారించాడు.. ఒకచోట భయంకరమైన పిశాచరూపాలుగల గాడిదలు చంపబడి ఉన్నాయి. అవి ఎవరివి? అని మరల పరిశీలనగా చూడసాగాడు రాముడు. అక్కడ పడి ఉన్న రథాన్ని మరికాస్త వివరంగా చూడసాగాడు. అక్కడ ఏదో భయంకరమైన యుద్ధం జరిగిన ఆనవాళ్ళు కనపడుతున్నాయి.

లక్ష్మణా ఇదుగో ఇటుచూడు వీరెవరో మహారాజుకు చామరగ్రాహుల వలె ఉన్నారు వీరిచ్చట చచ్చి పడియున్నారు.

ఇదుగో ఇక్కడ! ఇతని చేతిలో కొరడా, కళ్ళాలను ధరించి ఉన్నాడు బహుశా ఇతను సారధి అయి ఉండవచ్చును.

ఇది ఎవ్వడో పురుషుడైన రాక్షసుడు ఈ మార్గంలో సంచరించినాడని తెలియచేయుచుంది.

ఇది నా జీవితానికే ముప్పు తెచ్చింది చూడు.

లక్ష్మణా అసలు నాకే ఇలా ఎందుకు జరగాలి?

నేను అనుసరించే ధర్మం, నా సీతను కాపాడలేకపోయిందా?

ఏ దేవతలు ప్రియం చేయగలరు?

ఇది తీరని నష్టం కదా!

లక్ష్మణా దయ, కరుణ అనే లక్షణాలున్న వానిని చూసి అతనెంత వీరుడైనా, శూరుడైనా, ఈ లోకాలను సృష్టించగల సమర్థుడైనా గానీ అందరూ తమతమ అజ్ఞానం వలన అతనిని అవమానిస్తారు.

నేను ఎవరికీ ఏ హానీ తలపెట్టక మెత్తగాయుండుట వలన దేవతలు నన్ను పరాక్రమ శూన్యమైనవాడని తలస్తున్నట్లుగా ఉంది.

లక్ష్మణా నాలోని గుణాలు కూడా ఎలా దోషాలుగా మారినవోకదా.

ఇదుగో ఈ క్షణం నుండీ యక్ష, గంధర్వ, పన్నగ, పిశాచ, రాక్షస, కింనర, మానవులలో ఎవరినీ ఈ పుడమి మీద ప్రశాంతంగా ఉండనివ్వను, గ్రహగతులు నిలిచిపోవునట్లు, చంద్రుడు ఉదయించకుండునట్లు, అగ్ని, వాయువు, సూర్యుడు తమతమ తేజస్సులను ఉపసంహరించుకునే విధంగా చేసెదను. సరస్సులు, సముద్రాలు, లతలు పొదలు ఎండిపోవునట్లు చేసెదను. ముల్లోకాలలో ప్రళయం సృష్టించెదను.

దేవతలు సీతను నాకు క్షేమంగా అప్పగించనిచో ఇక ప్రళయమే.

నా ధనుర్విముక్త శరాలు ఆకాశాన్ని కప్పివేస్తాయి, జలనిధులను ఇంకింపచేస్తాయి, పర్వతాలను చూర్ణం గావిస్తాయి.

నా సీత నాకు దక్కని ఎడల ముల్లోకాలలో ప్రశాంతంగా ఏ ప్రాణీ తన మనుగడ సాగించలేదు.

ఇది తథ్యము, తథ్యము, తథ్యము.

అని తన కోపాన్ని తీవ్రంగా వెళ్లగక్కుతూ, అరుణిమ దాల్చిన నేత్రాలు విస్ఫులింగాలు వెదజల్లుతుండగా క్రోధమూర్తి అయినాడు, సీతావియోగపీడితుడు రఘుకుల తిలకుడు జానకిరాముడు.

ఈయన రుద్రుడా?

లేక వీరభద్రుడా?

పుట్టి బుద్ధి ఎరిగిన తరువాత ఈ రూపం ఎన్నడూ చూడలేదు భయంతో ముఖం ఎండిపోయింది, నాలుక తడి ఆరిపోయింది లక్ష్మణునికి.

ఈయన మా రామన్నేనా?

ఏమి రూపమిది?

మాటి మాటికీ నారి సారిస్తున్నాడు ధనుస్సు వైపు చూస్తున్నాడు.

ప్రళయ కాలాగ్ని సమానంగా భాసిల్లుతుంది ఆయన ముఖమండలం. అడుగు ముందుకువేసి పిడికిలి బిగించి ధనుస్సు మధ్య భాగాన్ని ఎత్తి పట్టుకొని ప్రళయకాలంలో విలయ తాండవం చేసే మహాదేవుడా అన్న రీతిలో భయం గొల్పుతున్నాడు.

లక్ష్మణుడు ఎలాగో గుండె చిక్కబట్టుకున్నాడు.

నెమ్మదిగా ఆయనతో...

అన్నా! నీవేనా! పరమశాంతమూర్తివైన మా రామభద్రుడవేనా?

సకల జీవసంరక్షణవ్రతంగా కలిగిన రామచంద్రుడవేనా?

నీ సహజ స్వభావం విడిచి ఈ క్రోధానికి వశుడవైనావేమి?

చంద్రునిలో శోభ..

సూర్యునిలో కాంతి..

వాయువునందు సదా గమనం..

భూమియందు ఓర్పు..

ఏ విధంగా ఉన్నవో నీ యందు ఉత్తమమైన కీర్తి కూడా స్థిరంగా ఉంది.

ఎవడో ఒక్కడు చేసిన అపరాధానికి ఈ లోకం మొత్తాన్నీ నాశనం చేయబూనుట యుక్తము కాదు.

నీ భార్య నశించుట మంచిదే అని ఎవరనుకొంటారు?

వీరందరి రక్షణ బాధ్యత స్వీకరించినవాడవు నీవు, దయామయుడవు, రఘురామా శాంతించు.

మనకు ఎవరు అపకారం చేశారో వానిని వెతికి పట్టుకొని దండిద్దాం, అందుకు మహర్షుల సహాయం తీసుకొందాం.

భూమి అణువణువూ శోధించుదాం, సముద్రాలు, నదులు, పర్వతాలు, వనాలు, భయంకరమైన గుహలూ, పద్మవనాలూ వెదుకుదాం, నీ భార్య దొరికేంతవరకు దేవ, గంధర్వ, పాతాళ లోకాలన్నీ గాలిద్దాం.

నీ భార్యను నీకు అప్పగించని ధూర్తునికి తీవ్రమైన దండనే!

వజ్రాయుధాలతో సమానమైన నీ వాడి వాడి బాణాలు వాడి వేడివేడి నెత్తురును రుచిచూస్తాయి.

కోసలాధీశా, కోదండరామా!

అప్పటివరకు కాస్త శాంతించవయ్యా అని పరిపరి విధాలుగా ప్రార్థించాడు రామానుజుడు.

స్థైర్యం కోల్పోయి పసిపిల్లవాడిలాగా విలపిస్తున్న రాముని చూసి లక్ష్మణుని హృదయం ద్రవించింది.

అన్న పాదాలు తాకి ఆయనకు ధైర్యం చెప్పసాగాడు.

దేవతలు ఎంతో కష్టపడి అమృతం సాధించుకున్నారు, అలాగే దశరథ మహారాజు ఎన్నో నోములు, వ్రతాలు, యజ్ఞాలు చేసి నిన్ను పొందాడు. ఆయన పుణ్యఫలానివి నీవు.

నీ వియోగమువలననేకదా ఆయన అసువులు బాసింది.

రామా ఇలాంటి కష్టం నరశ్రేష్ఠుడైన నీవంటి వాడు ఓర్చుకొని తదుపరి కర్తవ్యం ఆలోచించుకొనవలె కానీ ఇలా దుఃఖిస్తే ఎలా?

సామాన్యునికే ఇలాంటి కష్టం వస్తే పరిస్థితి ఏమిటి?

రామా అమితమైన దుఃఖములో నీవంటి వాడు లోకాలకు హాని చేస్తే ప్రజలేమవ్వాలి?

భూదేవికి కూడా అప్పుడప్పుడు చలనం సంభవిస్తుంది కదా!

సూర్యచంద్రులకు కూడా గ్రహణం సంభవిస్తుంది కదా!

ఇంద్రుడిలో కూడా నీతి దుర్నీతి ఉన్నట్లు మనం వింటున్నాం కదా!

రామా ఎల్లప్పుడూ సత్యాన్నే చూచు నీ వంటి వారు ఇలాంటి కష్టాలు వచ్చినప్పుడు శోకించుట తగదు.

నీవు బుద్ధిశాలివి, నీ బుద్ధితో ఆలోచించి యదార్ధ స్థితి గురించిన మంచిచెడ్డలను తెలుసుకొనగలవాడవు.

కర్మల గుణదోషాలను మనం చూడజాలం అవి అస్థిరములు. ఎందుచేతననగా ఏ కర్మ అయిననూ అది పూర్తి అయిపోగానే నశించును, మనకు ఇప్పుడు లభించుచున్న కర్మఫలాలు మనం పూర్వజన్మలో చేసిన కర్మల వలననే కదా! కర్మ ఫలానుభవం తప్పదు కదా!

.. (సశేషం)

## ఆనం వెంకటరెడ్డి విగ్రహం

# పునఃఆవిష్కరణ..8న



ఉక్కుమనిషిగా పేరొంది, పాతతరం రాజకీయాల్లో జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన నెల్లూరు నేత ఆనం చెంచుసుబ్బారెడ్డి (ఏసీ సుబ్బారెడ్డి). ఆయన తర్వాత, ఆనం వారి కుటుంబ కీర్తిగా, జిల్లాలో ఆనం వారి రాజకీయాలకు స్ఫూర్తిగా నిలిచింది ఆయన సోదరుడు మాజీమంత్రి ఆనం వెంకటరెడ్డి అన్నది జిల్లా ప్రజానీకానికి తెలిసిన విషయమే. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వీరి కుమారుడే. ఆ రాజకీయ యోధుని విగ్రహాన్ని పునరావిష్కరించేందుకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 8వతేదీ ఆదివారం ఉదయం 9.30గంటలకు నెల్లూరులోని రామలింగాపురం 'ఆనం వెంకటరెడ్డి సెంటర్'లో విగ్రహావిష్కరణకు శుభముహూర్తం ఖరారైంది. సింహపురి సేవాసమితి వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఆనం వెంకటరెడ్డి విగ్రహాన్ని అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008 ఏప్రిల్ 29వ తేదీన ఆవిష్కరించగా, ఆ తర్వాత రామలింగాపురం వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం సందర్భంగా ఆ విగ్రహాన్ని తొలగించారు. ఇప్పుడు అదే కూడలిలో ఆ విగ్రహాన్ని పున:ప్రతిష్టింపజేస్తుండడం విశేషం. ఆనం కుటుంబసభ్యుల సమక్షంలో జరిగే ఈ కార్యక్రమానికి ఆనం కుటుంబ అభిమానులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నగర ప్రముఖులు పాల్గొని జయప్రదం చేయాలని సింహపురి సేవాసమితి కోరుతోంది.

# విపిఆర్ నివాసంలో సంబరాలు



రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తెలుగుదేశం, బిజేపీ, జనసేన పార్టీల కూటమి 2024 ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అఖండ విజయం సాధించి ఏడాది పూర్తయిన సందర్భంగా నెల్లూరులోని ఎంపీ విపిఆర్ నివాసంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఆ ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ సభ్యులుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి భారీ విజయం సాధించిన నేపథ్యంలో టీడీపీ నాయకులు బెజవాడ వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు కేకు కట్ చేసి అందరికీ పంచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చెప్పారు, రాష్ట్రం సుభిక్షంగా ఉందని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డేవిడ్ జాన్, బుచ్చిరెడ్డిపాలెం అర్బన్, రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు గుత్తా శ్రీనివాస రావు, బెజవాడ జగదీష్‌లతో పాటు కోవూరు నియోజకవర్గానికి చెందిన అన్ని మండలాల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివేకానంద వాకర్స్ ఆధ్వర్యంలో..

# క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఇటీవల నెల్లూరులోని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పద్మప్రియ ఫైనాన్స్ అధినేత జీవి రత్నం క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం. ప్రభావతి, నేతాజీ సుబ్బారెడ్డి, రాఘవేంద్రశెట్టి, పలగాటి శ్రీనివాసులురెడ్డి, ఎం వి రెడ్డి, ఏకోలు రాఘవరెడ్డి, నలుబోలు బలరామయ్య నాయుడు, అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేందర్‌రెడ్డి, సెక్రెటరీ పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## లోకేష్‌తో సోమిరెడ్డి భేటీ

యువనేత, విద్యామంత్రి నారా లోకేష్‌బాబును ఇటీవల అమరావతి లోని కార్యాలయంలో మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లోకేష్ వారికి యువగళం అనుభవాలతో కూడిన 'ది వాయిస్ ఆఫ్ పీపుల్' పుస్తకాన్ని అందజేశారు.



# షాదీమంజిల్‌కి.. 'కోటి' వెలుగులు

- ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణ చెరొక 50 లక్షల వితరణ




ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పురపాలకశాఖ మంత్రి నారాయణ నెల్లూరులోని జనార్ధన్‌రెడ్డి కాలనీలో ఇటీవల షాదీమంజిల్ పున:ప్రారంభానికి చెరొక 50 లక్షల రూపాయలు తమ వితరణగా అందజేసి, మైనార్టీలకు తామిచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆమేరకు కోటి రూపాయల చెక్కును ఇద్దరు నేతలూ కలసి నగరపాలక సంస్థ కమిషనర్ నందన్‌కి అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు వారికి జేజేలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారం షాదిమంజిల్ నిర్మాణానికి సొంత నిధులు ఇస్తామని హామీ ఇచ్చామని, ఆ హామీని ఈ రోజు నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. ముస్లిం మైనార్టీ సోదరులు ఎన్నికల్లో ఎంతో కష్టపడి తమ గెలుపు కోసం పని చేశారని గుర్తు చేశారు. వారందరి సంక్షేమానికి తాము కట్టుబడి ఉంటామని వెల్లడించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ, నెల్లూరు 54వ డివిజన్ జనార్ధన్‌రెడ్డి కాలనీలో షాదీ మంజిల్ నిర్మాణ పనులు ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వం ఆపేసిన షాదీ మంజిల్ పనులను తిరిగి ప్రారంభిస్తున్నామని చెప్పారు. 2019లో కోటి రూపాయల కార్పొరేషన్ నిధులతో షాదీమంజిల్ పనులు ప్రారంభించామని, అయితే ఆ పనులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలిపివేసిందన్నారు. గత పాలకులు అభివృద్ధి పనుల విషయంలో శాడిజాన్ని చూపించారని మండిపడ్డారు. పరిపాలన చేతకాక రాష్ట్రంలో వ్యవస్థలన్నింటిని గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని దుయ్యబట్టారు. షాదీ మంజిల్ నిర్మాణానికి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా నేను ఎన్నికల్లో హామీ ఇచ్చామని, ఆ మేరకు చెరో యాభై లక్షల రూపాయలు విరాళం ఇచ్చి కోటి రూపాయలతో పనులను పునః ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అన్ని హంగులతో అక్టోబర్ లోపు షాదీ మంజిల్‌ను సర్వాంగ సుందరంగా రూపుదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మైనార్టీ వర్గాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి.. నారాయణ

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రిగా డాక్టర్ పొంగూరు నారాయణ విజయ పరంపర కొనసాగిస్తూ ఏడాది పూర్తి చేసుకొన్న సందర్భంగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు ఆధ్వర్యంలో పట్టణ నాయకులు కేక్ కట్‌చేసి హుషారుగా కేకలు వేస్తూ... మంత్రి నారాయణ వర్ధిల్లాలంటూ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా తమకు అండగా ఉంటూ, పేదల పెన్నిధిగా నిలుస్తున్న మంత్రికి తోడుగా నిలుస్తూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.

# కోటంరెడ్డి సారథ్యంలో.. 'చంద్రన్న పల్లెపండుగ'

- 11 కోట్లతో అభివృద్ధి పనులు
- నెల్లూరు రూరల్‌లో సందడే సందడి



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో రూరల్‌లోని గ్రామాల్లో 'చంద్రన్న పల్లెపండుగ' కార్యక్రమాలు సందడిగా జరగనున్నాయి. ఈనెల 6,7,8,9 తేదీల్లో రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామాల్లో ఈ పండుగ హోరెత్తబోతోంది. ఈనెల 5 గురువారం నాడు తన కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ పండుగలో భాగంగా 11 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేస్తామన్నారు. 6వ తేది ఉదయం 8 గంటలకు గొల్లకందుకూరు గ్రామంలో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ఆరోజున సజ్జాపురం, కొత్తవెల్లంటి, కందమూరు గ్రామాల్లోనూ, 7వ తేదీన దొంతాలి, ఆమంచర్ల, ఉప్పుటూరు, సౌత్ మోపూరు గ్రామాల్లో, 8న కలివెలపాళెం, పెనుబర్తి, మాదరాజుగూడూరు, కాకుపల్లి గ్రామాల్లోనూ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. నాల్గవ రోజైన 9వ తేదీన ములుమూడి, కొమ్మరపూడి, కొండ్లపూడి, పొట్టేపాళెం గ్రామాల్లో చంద్రన్న పల్లె పండుగ జరుగుతుందని, ఆయా గ్రామాల్లో ఎక్కడికక్కడ ప్రజలను ఆ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని, ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి జరుగుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటీ నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని, కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు నిండుగా మెండుగా ఉండాలని ఆయన కోరారు.

# రాష్ట్రంలో అభివృద్ధి.. కళ్ళకు కనిపించడం లేదా?

## వైకాపా నాయకులపై ప్రశాంతమ్మ ధ్వజం



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోందని, ఆ అభివృద్ధి మీ కళ్ళకు కనిపించడం లేదా అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వైకాపా నాయకులనుద్దేశించి ఘాటుగా ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో 70 శాతం హామీలను తొలి ఏడాదిలో అమలు చేసి కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటోందని ఆమె చెప్పారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదని మండిపడ్డారు. బుధవారం నెల్లూరు నగరంలోని విపిఆర్ నివాసంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, ప్రత్యేకించి కోవూరు నియోజకవర్గంలో చేపట్టిన ప్రగతి పనులను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారం లోకి వచ్చిన వెంటనే 3వేలు ఉన్న పెన్షన్‌ను 4వేలు, ఆ తర్వాత 6 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. వెయ్యి రూపాయలు పింఛను పెంచడానికి గత ప్రభుత్వానికి 5 ఏళ్ల పట్టిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ యాక్ట్ రద్దయిందని, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం 16 వేల డీఎస్సీ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది తమ ప్రభుత్వమేనన్నారు. అదేవిధంగా, 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమం కింద, సముద్రంలో వేట నిషేధ సమయంలో ఇచ్చే 10వేల సహాయాన్ని తమ ప్రభుత్వం రూ. 20వేలకు పెంచి అందజేయడం జరిగిందన్నారు. జూన్ 12 నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను కూడా అమలు చేయనున్నారని వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ విద్యా విధానాన్ని సంపూర్ణంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని చెప్పారు. అస్తవ్యస్తంగా ఉన్న రహదారులను బాగుచేసి గుంతలరహిత ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దారన్నారు. తమపై నమ్మకం పెట్టుకున్న ప్రజలకు కూటమి నేతలు ఆపద్బాంధవులుగా నిలిచారని చెప్పారు. గత ప్రభుత్వం, పేదల నోటికాడి కూడును తీసేస్తే తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే పేదల ఆకలి తీర్చడం కోసం 200 అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించిందన్నారు. ఆర్థిక ఒడిదుడుకులతో నడుస్తున్న రాష్ట్రాన్ని, తమ ప్రభుత్వం వచ్చాక బాగు చేస్తూ, సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లతో అమలుచేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం కార్పొరేషన్లను నిర్వీర్యం చేస్తే, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా బడుగు బలహీన వర్గాలకు రుణాలు ఇచ్చిందన్నారు. గతంలో తాగడానికి నీళ్లు లేవు అనే పరిస్థితి నుంచి, ఇప్పుడు ప్రజలకు పుష్కలంగా నీరు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన ముదివర్తి కాజ్‌వేను కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి చేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నామన్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించామన్నారు. ఈ షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమలు తీసుకువస్తామని వెల్లడించారు. కొత్తగా రేషన్‌కార్డులు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, విద్యామంత్రి లోకేష్‌బాబు ఆలోచనలతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని, ఇంకా అనేక సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతాయని ఆమె వివరించారు.

### మీడియా అకాడమీ చైర్మన్‌గా..

# బాధ్యతలు స్వీకరించిన ఆలపాటి



ఏపీ మీడియా అకాడమీ ఛైర్మన్‌గా ఆలపాటి సురేష్‌కుమార్ ఈనెల 5న విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. పలువురు ప్రముఖ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పాల్గొని ఆలపాటిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారోత్సవ సభలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాసరెడ్డి, సుబ్బారావు, చందూ జనార్ధన్, మణిరామ్ తదితరులు ఆలపాటిని అభినందించి సన్మానించారు. అనంతరం ఆలపాటి మాట్లాడుతూ, నేడు ప్రింట్ మీడియాను దాటి ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా వచ్చాయని, అయితే ఈ మార్పుల వల్ల మంచితో పాటు చెడు కూడా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలికాలంలో సోషల్ మీడియాలో చెడు పోకడలు ఎక్కువయ్యాయన్నారు. దానిని నియంత్రించడం అంత తేలిక కాదన్నారు. అయితే..ఆ రంగంలో దూషణలు, వ్యక్తిత్వ హననం వంటివి పెరిగిపోయాయన్నారు. చట్ట వ్యతిరేకంగా ఉండే అలాంటి కార్యక్రమాలను నిలపాల్సిన అవసరం ఉందన్నారు. మంచిని ప్రోత్సహించాలని అన్నారు. మీడియా అకాడమీ ఛైర్మన్‌గా అందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించాలన్నారు. అదేవిధంగా, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వేలాదిమంది పాత్రికేయులకు వృత్తిపరంగా మెళకువలు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు తాను చేయగలిగిన ప్రయత్నమంతా చేస్తానని తెలిపారు.

### పకడ్బందీగా..

# మెగా డీఎస్సీ

జిల్లాలో మెగా డీఎస్సీ-2025 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా, జిల్లా రెవెన్యూ అధికారి(డిఆర్ఓ) ఉదయభాన్కర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో ఈ పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 6వ తేదీ నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 8 పరీక్షా కేంద్రాల్లో 31,221మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీసు అధికారులకు డిఆర్ఓ సూచించారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టంచేశారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు సమయానికి చేరుకునేలా బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను సూచించారు. విద్య, వైద్యం, పోలీసు, రెవెన్యూ, మెడికల్, విద్యుత్‌శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన సూచించారు.

### మొక్కలు నాటుదాం..

# పచ్చదనాన్ని కాపాడుకుందాం

**జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపు**



పర్యావరణాన్ని కాపాడుకుందామని, ప్రకృతిని పరిరక్షించుకుందామని నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, ఈనెల 5న నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో ఆమె జడ్పీ సీఇఓ, డిప్యూటీ సీఇఓలతో కలసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మన చుట్టూ ఉన్న వాతావరణం, నీరు, నేల, అడవులు, జంతువులు, చెట్లు ప్రకృతి అంతా కలసి పర్యావరణ అవుతుందని, ప్రకృతి-పర్యావరణాలే మానవ మనుగడకు ప్రాణమని అన్నారు. అయితే, అభివృద్ధి పేరుతో మానవుడు ప్రకృతిని నాశనం చేస్తున్నాడని, అడవుల నరికివేత, నదుల కాలుష్యం, గాలి మాలిన్యం వంటివన్నీ కలసి మానవాళి భవితకు పెద్ద ముప్పుగా పరిణమించనున్నాయని, కనుక మొక్కలను పెంచుతూ పచ్చదనాన్ని కాపాడుకోవాలన్నారు. కాలుష్యాన్ని పెంచుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిరోధించుకోవాలని సూచించారు. నీటి వనరులను సంరక్షించుకుంటూ, ప్రకృతిని పరిరక్షించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వద్దు..వస్త్ర సంచులే వాడండి!

**- - - పర్యావరణ ర్యాలీలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ - - -**





ప్లాస్టిక్ నిషేధం కేవలం నినాదంగానే కాకుండా ప్రజలందరి జీవన విధానంలో ఆ నినాదం భాగమయినప్పుడే సత్ఫలితాలు వస్తాయని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె. కార్తీక్ తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, ఇన్‌చార్జి కలెక్టర్ నేతృత్వంలో కాలుష్య నియంత్రణ మండలి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని విఆర్‌సి కూడలి వద్ద నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా, "ప్లాస్టిక్ వద్దు- వద్దు-వస్త్ర సంచులే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ప్లాస్టిక్‌ని నిరోధించటానికి అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ పిలుపునిచ్చారు. నగర కార్పొరేషన్ కమిషనర్ నందన్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్‌కుమార్, డీసీఓ గురప్ప, సెట్నెల్ సీఈవో నాగేశ్వరరావు ర్యాలీలో పాల్గొన్నారు.

# సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలు



ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఏపీఎఫ్‌సీసీ) నెల్లూరు డివిజన్ ఆధ్వర్యంలో ఇటీవల సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఏపీఎఫ్‌సీసీ డివిజన్ కోఆర్డినేటర్, ప్రముఖ నటుడు-దర్శకుడు 'కళాంజలి' అనంత్ సారధ్యంలో స్థానిక అవోపా కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు ప్రముఖులు, కళాకారులు పాల్గొని, పలు చిత్రాల్లో కృష్ణ అద్వితీయ నటనా ప్రతిభను గుర్తుచేసుకున్నారు. స్థానిక ప్రముఖులు వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, కృష్ణ అభిమానులు మనోజ్, సిరాజ్, సుకూర్‌లతో పాటు అవోపా సభ్యులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!




నెల్లూరు వాస్తవ్యులు నర్రా శ్రీధర్ - శ్రీమతి పద్మల కుమార్తె **డా. రచన - డా. కిషోర్‌కుమార్ నాయుడు** (తిరుపతి వాస్తవ్యులు మల్లారపు రఘునాథనాయుడు - శ్రీమతి భారతిల కుమారుడు)ల వివాహం మే 31న నెల్లూరులో వైభవంగా జరిగింది. కొత్త దంపతులకి 'లాయర్' శుభాశీస్సులు.




నెల్లూరు వాస్తవ్యులు దొంతంశెట్టి శ్రీనివాసకుమార్ - శ్రీమతి నిర్మలల కుమార్తె **అనీషా - పృథ్వి గణేష్** (నెల్లూరు వాస్తవ్యులు శ్రీసామి జ్వాలా వరప్రసాద్‌రావు - శ్రీమతి భాగ్యలక్ష్మిల కుమారుడు)ల పరిణయం జూన్ 4న నెల్లూరులో ఘనంగా జరిగింది. నూతన వధూవరులకి 'లాయర్' శుభాభినందనలు.

# మైపాడు బీచ్‌లో 'యోగాంధ్ర'!





ఇందుకూరుపేట మండలం మైపాడు బీచ్ వద్ద ఇటీవల నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైంది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఆ ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యోగాంధ్ర కార్యక్రమంలో 2000 మందికి పైగా పాల్గొనడం విశేషం. ఆయుష్, యోగా మిత్ర మండలికి చెందిన యోగా గురువులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొని సామూహిక యోగా కార్యక్రమంలో పాల్గొన్న వారిచే యోగాసనాలు వేయించారు. కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు యోగాను భాగం చేసుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపకరిస్తుందని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చెప్పారు. యోగాంధ్ర ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశిస్తున్న ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సంకల్పం సాకారం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఆరోగ్యకర జీవన విధానం యోగతోనే సాధ్యమన్నారు. గ్రామ, వార్డు స్థాయిల యోగ శిక్షణలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆర్డీఓ అనూష, జిల్లా పర్యాటక శాఖా అధికారి ఉషశ్రీ, నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో 'రామకృష్ణ మిషన్' శాఖ ఆవిర్భావం

## ప్రముఖ స్వామీజీల రాకతో కళకళలాడిన సేవాశ్రమం



నెల్లూరులో రామకృష్ణ మిషన్ శాఖ ఆవిర్భవించింది. జూన్ 1 ఆదివారం స్థానిక నవలాకులతోట వద్ద ఉన్న శ్రీరామకృష్ణ సేవాశ్రమం వేదికగా జరిగిన కార్యక్రమంలో, కలకత్తా నుంచి వచ్చిన రామకృష్ణ మిషన్ ట్రస్టీ, బేలూరు మఠం మేనేజర్ స్వామి జ్ఞానవ్రతానందజీ మహారాజ్ వారు ఈ శాఖను అధికారికంగా ప్రారంభించారు. స్వామీ పూర్ణానంద వారు 40 సంవత్సరాల క్రితం నిర్మించి నిర్వహించిన శ్రీ రామకృష్ణ సేవాశ్రమం స్వామీజీ వీలునామాతో రామకృష్ణ మిషన్‌కు అప్పగిస్తున్నట్లు సేవాశ్రమం అధ్యక్షులు డా. ఎం.మోహన్‌రాజు తెలిపారు. ఆమేరకు దస్తావేజు పత్రాలను సభాముఖంగా స్వామీ జ్ఞానవ్రతానందజీకి అప్పగించారు. రామకృష్ణ మిషన్ తిరుపతి కేంద్రం కార్యదర్శి శ్రీ స్వామి సుకృతానందజీ మహారాజ్ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భారత పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పంపిన సందేశాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి చదివి వినిపించారు. అనంతరం, నెల్లూరు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి హృదానందజీ మాట్లాడుతూ, భక్తులు దాతల సహకారంతో నెల్లూరులో విద్య, ఆరోగ్య విషయాలకు సంబంధించి అవసరమైన భవనాలను నిర్మించి, హోమియో-ఫిజియోథెరపీ తదితర సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా, రామకృష్ణ మిషన్ ప్రధాన కేంద్రం సహాయ కార్యదర్శి శ్రీ తత్వవిదానందజీ మహరాజ్ ఆధ్వర్యంలో ఆలయంలో భగవాన్ శ్రీ రామకృష్ణుల విగ్రహాన్ని పున:ప్రతిష్ఠించి పూజలు చేశారు. కె.లక్ష్మీప్రసాద్ (ఢిల్లీ), స్విస్ ల్యాబ్స్ (తమిళనాడు) అధిపతి పక్యాల భాస్కరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డితో పాటు, పలు ప్రాంతాల నుంచి రామకృష్ణ మిషన్, మఠం కేంద్రాల స్వామీజీలు పాల్గొన్నారు. రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ రాయలసీమ విభాగం కన్వీనర్ గంగాధర్; సంయుక్త కన్వీనర్ ఎం.మల్లికార్జునరావు, జిల్లా సమన్వయకర్త జి.జయచంద్ర, రామకృష్ణ మిషన్ ప్రతినిధి టి.లక్ష్మీనారాయణరావు తదితరులు పాల్గొన్నారు. చెన్నై-రామకృష్ణ మఠం మేనేజర్ స్వామి రఘునాయకానంద వ్యాఖ్యాతగా వ్యవహరించగా, సేవాశ్రమ కార్యదర్శి సాయిరవి, వై.రామచంద్రారెడ్డి, అన్నప్రసాద వితరణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# చిరస్మరణీయుడు..వెన్నెలకంటి రాఘవయ్య

- జయంతి సందర్భంగా వక్తల నివాళి



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనోద్ధారకుడు.. పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య చిరస్మరణీయుడని, గిరిజనులు-యానాదుల జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేసేందుకు జీవితాంతం ఆయనెంతగానో తపించారని వక్తలు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈనెల 4న వెన్నెలకంటి రాఘవయ్య 128వ జయంతి కార్యక్రమాన్ని నెల్లూరు 'వెన్నెలకంటి భవన్'లో ఘనంగా నిర్వహించి గిరిజన నాయకులు, స్థానికులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ, నాటి బ్రిటిష్‌పాలకులను సైతం ఎదిరించి సమాజంలో అట్టడుగున పడివున్న ఆదిమజాతి ప్రజల అభ్యున్నతి కోసం, యానాదులను-గిరిజనులను క్రూరంగా హింసించే క్రిమినల్స్ ట్రైబ్స్ చట్టాన్ని రద్దుచేయించడం కోసం వెన్నెలకంటి రాఘవయ్య చేసిన వీరోచిత పోరాటం ఏనాటికీ విస్మరించలేనిదన్నారు. ప్రత్యేకించి గిరిజన-యానాది విద్యార్థుల చదువు కోసం ఆయన చేసిన కృషి అమోఘమన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆ మహనీయుని విగ్రహాన్ని నెలకొల్పి భావితరాలకు మార్గదర్శకం కావాలని, వెన్నెలకంటి జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన కోరారు. గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు ఉష, కల్లూరు వరలక్ష్మి, రమణ, నాగమణి, పొల్లూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ధూమపానానికి దూరంగా ఉండాలి

- ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో ఎన్‌సిసి విద్యార్థుల ర్యాలీ




ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇటీవల కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ కళాశాలలో ఎన్‌సిసి విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి పాల్గొని, పొగాకు వాడకం వల్ల, ధూమపానం వల్ల ఆరోగ్యం సర్వనాశనం అవుతుందని, వాటి వల్ల కలిగే అనర్థాలను తెలియజెప్పారు. విద్యార్థులు, యువకులంతా ఆ దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆమేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు డా.వి. మల్లికార్జునరెడ్డి, డా.జి.మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

# అధ్యాపకుల సమస్యలు తీర్చండి

## ఏబీఆర్ఎస్ఎం నేతల డిమాండ్

రాష్ట్రంలోని ఉన్నత విద్యారంగంలో పేరుకుపోయిన అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి, వాటిని పరిష్క రించాలని ఏబీఆర్ఎస్ఎం (రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీఎస్వీఎస్ బాలసుబ్రహ్మణ్యం ఈనెల 3న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధ్యాపకుల నియామకం, పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు, పదవీ విరమణ చేసిన అధ్యాపకులకు రావాల్సిన బకాయిల విడుదల, కొత్త పీఆర్సీ ఏర్పాటు తదితర అంశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని వారు కోరారు. ఇప్పటికే ఈ విషయాలపై తమ సంఘం తరపున ముఖ్యమంత్రికి, విద్యా మంత్రి, ఆర్థికమంత్రులకు, ఉన్నత విద్యా విభాగం అధికారులకు వినతులు పంపివున్నామని, ఇకనైనా ప్రభుత్వం ఆ సమస్యలను పట్టించుకోవాలని వారు కోరారు.

## గిట్టుబాటు ధర లేక..

# పసుపు రైతులకు కష్టాలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో పసుపు పంట పండిస్తున్న రైతులు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. తమ కష్టాలు గమనించి తమను ఆదుకోవాలంటూ ఆ రైతులు కోరు తున్నారు. ఉదయగిరి మండలంలోని బండగానిపల్లిలో ఈనెల 1న రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ హయాంలో క్వింటాలుకు రూ. 18వేలు ధర ఉండగా, ఆ తర్వాత వైకాపా హాయంలో 16వేల వరకు ఉం దేదని, ఇప్పుడది కేవలం 9 వేల రూపాయలకు దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరా పసుపు పంట సాగుకు కనీసం 2లక్షల రూపాయల దాకా వ్యయమవుతుందని, రైతులు అప్పో సప్పో చేసి కష్టపడి పంట పండిస్తున్నా.. కూలిఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదని, ప్రభుత్వం ఈ పరిస్థితులను పరి శీలించి పసుపు రైతులకు గిట్టుబాటు ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# డీఎస్సీ..హాల్‌టిక్కెట్లు సిద్ధం

జూన్ 6 నుంచి 30వతేదీ వరకు జరగనున్న మెగా డీఎస్సీ పరీక్షకు సంబంధించిన హాల్‌టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టిక్కెట్‌లో ఫోటో లేనివారు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఐడెంటిటీ కార్డుతో పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలని, హాల్‌టిక్కెట్లలో ఏవైనా పొరపాట్లుంటే అభ్యర్థులు ఆయా కేంద్రాల చీఫ్ సూపరిం టెండెంట్ వద్ద నామినల్‌రోల్స్‌లో సరిచూసుకోవాలని సూచించారు.

## వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు

# బి.ఆర్.నాయుడుకి ఆహ్వానం



ఉదయగిరి నియో జకవర్గంలోని వరి కుంటపాడు మండలం నర్రవాడలో ఈనెల 15 నుంచి పెద్ద ఎత్తున జరిగే శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మవారి బ్రహ్మోత్సవాలకు రావా ల్సిందిగా తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి ఛైర్మన్ బీఆర్ నాయుడును ఈనెల 2న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆహ్వానించారు. ఆమేరకు ఆహ్వానపత్రికని ఆయనకు అందజేశారు. హైదరాబాద్ లోని బీఆర్ నాయుడు కార్యాలయంలో ఆయన్ను కాకర్ల మర్యాదపూర్వకంగా కలుసుకుని, శ్రీ వెంగమాంబ దేవాలయం అభివృద్ధికి సహకరించాల్సిందిగా కోరారు. తాను తప్పకుండా అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వస్తానని, ఆలయ అభివృద్ధికి తగు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు కాకర్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంగమాంబ అమ్మవారి ఆలయ ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లునాయుడు, మల్లంపాటి గురవయ్యనాయుడు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# పేద రోగులకు పెద్దాసుపత్రిలో ఆధునిక వైద్యం

## గుండెజబ్బుల నివారణకు క్యాథ్ ల్యాబ్

## రూ. 5.67 కోట్లతో ఏర్పాటుకు అనుమతించిన ప్రభుత్వం

పేదల కోసం ఆధునిక వైద్యాన్ని అందుబాటులోకి తెస్తూ నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో ఇటీవలి కాలంలో పలు ఆధునిక పరికరాలు సమకూరాయి. తాజాగా గుండె జబ్బులున్న వారికి కూడా అత్యంత అవసరమైన పరీక్షలు, చికిత్సల కోసం 5.67 కోట్ల రూపాయలతో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుకు కూడా ప్రభుత్వం అనుమతించడం విశేషం. గుండెకు వెళ్లే రక్తనాళాలు పూడిపోతే వెంటనే గుర్తించేందుకు ఈ క్యాథ్ ల్యాబ్ ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఎంతోకాలం నుంచి ఈ అధునాతన ల్యాబ్ మనకు అందుబాటులో లేకపోవ డంతో, ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యధిక ఫీజులు భరించలేక గుండె సమస్యలున్నవారు ఎన్నో ఇబ్బందులు పడేవారు. ఈ ల్యాబ్ ఏర్పాటైతే ఆ బాధలు తీరుతాయని, త్వరలోనే అందుకోసం భవనాన్ని కూడా నిర్మించబోతున్నామని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు.

# సీపీఐ ధర్నాందోళన



పేదలకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలంటూ సీపీఐ (భారత కమ్యూనిస్టు సమితి) ఆధ్వర్యంలో ఈనెల 2న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నాందోళన నిర్వహిం చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ, గ్రామాల్లోని పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు రెండు సెంట్ల వంతున ఇళ్ల స్థలాలిస్తామని ఎన్నికలప్పుడు టీడీపీ నేతలు హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు జరగడం లేదని, ప్రభుత్వం అమలుచేస్తామన్న సూపర్‌సిక్స్ పథకాలను కూడా వెంటనే అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లలో కనీస వసతులు లేకపోవడంతో ఆ ఇళ్లలో చేరేందుకు ప్రజలు ముందుకు రావడం లేదన్నారు. అనంతరం, తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఉన్న అధికారులకు అందజేశారు. ఈ ఆందోళనలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, సీపీఐ మాజీ కార్యదర్శి రామరాజు, ఏఐటీయుసి జిల్లా అధ్యక్షుడు జిలానిఖాన్, నాయకులు కె. ఆంజనేయులు, ముక్తియార్, బీసీ శేఖర్, లీలామోహన్, అజీజ్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలి

జిల్లాలోని జాతీయ రహదారి-67 నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘాల నేతలు కోరుతున్నారు. ఈనెల3న వారు నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, బద్వేలు నుంచి గురివిందపూడి వరకు 168కిలోమీటర్ల జాతీయ రహదారిని నిర్మించేందుకు, జిల్లాలోని ఆరుమండలాల్లో ఉన్న 36గ్రామాల్లో 980 ఎకరాల భూములను అధికారులు సేకరించారని, ఆ రైతులకు భూసేకరణ చట్టం కింద నష్టపరిహారం చెల్లించా లని వారు కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య, రైతు సంఘం కార్యదర్శి మూలి వెంగయ్య, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గురునాథం, టి.గోపాల్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

# దిక్సూచిక

మరణం ఇప్పుడు శత్రువు కాదు
కాకి రెట్ట లాంటిది
మిత్రత్వం సాగించే క్రియా విశేషం
మరణం ఓ తుషార బిందువు
మరణం దు:ఖ వేదనను కల్గించదు
ఇది సహజమే కదా అని ధ్వనిస్తుంది
మనకూ సంప్రాప్తిస్తుంది కదా అని అనునయిస్తుంది
ఒకప్పటి మరణం వేదనాభరిత చరిత
'మనిషి మరణం' ఓ అధ్యాయానికి ముగింపే మిగిలేది
గుండెలు పగిలేలా శోకం బ్రద్దలయ్యేది
దిక్కులు పిక్కటిల్లేలా విలాపం సాగేది
మిత్రులు బంధువులూ మమేకమయ్యేవాళ్ళు
ఎందుకోగాని -
మరణం బలహీనమైపోయింది
చావు తప్పదని తెలిసి బ్రతికేవాళ్ళ లోకంలో
బలహీనపడ్డ వాయుగుండమై చినుకులుగా వర్షిస్తోంది
వేదనాపరిష్వంగం నుంచి సాధారణ స్థితికి చేరింది
దు:ఖాన్ని ఛేదించడం విజయానికి చేరువైన దిక్సూచిక
ఇది మరణాన్ని జయించటమే కదా
మరణాన్ని జయించిన
ఘనత మనిషిదే!
విజేత మానవుడే కదా!!



చిన్ని నారాయణరావు
9440202942

# టూకీగా...



## కోవూరులో వేసవి విజ్ఞాన శిబిరం

కోవూరులోని గ్రంథాలయంలో ఈ వేసవి సెలవుల్లో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 1న విద్యార్థులకు క్విజ్, ఆటల పోటీలు నిర్వహించి బహుమతు లిచ్చారు. గ్రంథాలయపాలకుడు సురేంద్ర, రిసోర్స్ పర్సన్లు పి.రంగారెడ్డి, భాస్కర్‌రావు పాల్గొని చిన్నారులకు వివిధ విజ్ఞాన విషయాలపై అవగాహన కల్పించారు.

## జొన్నవాడలో భగవద్గీత ప్రచారం

బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడలో ఈనెల 1న జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించి, జ్ఞానగ్రంథాల ప్రాశస్త్యాన్ని గ్రామస్తులకు వివరించారు. ఆ కమిటీ సభ్యులు సురమౌళి, వెంకటేశ్వర్లు, మోహన్, అన్నపూర్ణ, రిషిత, లీలావతి, శ్రావణి, కృష్ణ, గుప్తరాజు తదితరులు పాల్గొన్నారు.

## కసుమూరులో మలేరియాపై అవగాహన

వెంకటాచలం మండలంలోని కసుమూరు గ్రామంలో ఈనెల 1న ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రం అధికారి డాక్టర్ ప్రవల్లిక ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వ హించి, గ్రామస్తులకు మలేరియా వ్యాధి నివారణ పట్ల తెలియ జెప్పారు. ఆరోగ్య వేక్షకులు వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, ఏఎన్ ఎంలు, ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సంగం వద్ద గడ్డివామి దగ్ధం

మండల కేంద్రమైన సంగం-కలిగిరి రోడ్డుపక్కన ఎర్రచెరువు వద్ద పి.కృష్ణయ్య అనే రైతుకు చెందిన పదెకరాల గడ్డివామి ఈనెల 1న అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదానికి కారణం తెలియరాలేదు. ఉన్నట్లుండి గడ్డివామి నుంచి మంటలు చెల రేగాయని అంటున్నారు. దీంతో సుమారు 50వేల రూపాయలకి పైగానే నష్టం వాటిల్లిందని ఆ రైతు గోడుగోడుమంటున్నాడు.

## వింజమూరులో పాఠ్యపుస్తకాలు సిద్ధం

వింజమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలు వచ్చేశాయి. మొత్తం 29,180 పుస్తకాలు తమకు వచ్చాయని, వాటిని పాఠశాలలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, పాఠశాలలు ప్రారంభయ్యే రోజుకల్లా పాఠ్యపుస్తకాలు కూడా సిద్ధంగా ఉంటాయని మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

## ఉదయగిరిలో భవన నిర్మాణాల పరిశీలన

ఉదయగిరి ఎంపీడీఓ కార్యాలయానికి సంబంధించిన భవన నిర్మాణాలను ఈనెల 2న పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునికుమార్ పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు. సుమారు 27 లక్షల వ్యయంతో ఈ భవన పునర్నిర్మాణం జరుగుతోందని, నాణ్యతా ప్రమాణాలతో పనులను సకాలంలో పూర్తిచేయాలని ఆయన చెప్పారు.

## కందుకూరులో చెరువుల బాగుకు నిధులొచ్చాయ్

కందుకూరు నియోజకవర్గంలోని పలు మైనర్ చెరువులు, కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం 71 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో మరమ్మతు పనులను త్వరలోనే ప్రారం భించి, పూర్తిచేయిస్తామని నీటిపారుదలశాఖ డిప్యూటీ ఇంజనీర్ హజరత్తయ్య తెలిపారు.


## కావలి రూరల్‌లో పేకాట : ముగ్గురు అరెస్ట్

కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలకృష్ణారెడ్డినగర్ వద్ద పొలాల్లో పేకాటస్థావరాలపై కావలి రూరల్ పోలీసులు ఈనెల 3న దాడులు చేసి, ముగ్గురు పేకాటరాయుళ్ళను అదుపు లోకి తీసుకుని, వారివద్ద నుంచి రూ.1800 స్వాధీనం చేసుకు న్నారు. కావలి ఎస్ఐ తిరుమల్‌రెడ్డి వారిపై కేసు నమోదు చేశారు.

## సిద్ధనపాలెంలో రెండు పూరిళ్ళు దగ్ధం

బోగోలు మండలం సిద్ధనపాళెం గిరిజనకాలనీలోని ఇద్దరు గిరిజనుల పూరిళ్లు ఈనెల 3న అగ్నిప్రమాదానికి గురయ్యాయి. వంట చేసుకుంటుండగా నిప్పురవ్వలు ఎగిరిపడి ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే ఇళ్లు కాలిపోయాయి. కట్టుబట్టలతో మిగిలిన ఆ గిరిజనులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# 'ఉన్నా..నేనున్నా'



## విజృంభిస్తున్న కరోనా

### దేశ వ్యాప్తంగా 4,866 కేసులు, 51 మరణాలు

**కరోనా తగ్గిపోయిందిలే ఇక రాదనుకుంటున్న నేపథ్యంలో, నేనెక్కడికీ పోలేదు.. 'ఉన్నా.. నేనున్నా.. మీ మధ్యలోనే ఉన్నా' నంటూ కరోనా రాకాసి ప్రజలను భయపెడుతోంది. ఎప్పటికప్పుడు రూపాలు (వేరియంట్స్) మార్చుకుంటూ ఈ మాయదారి వ్యాధి గత కొద్దిరోజులుగా వీరంగం చేస్తోంది.**

ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు నమోదవుతున్నాయి. జూన్ 5వతేది గురువారం మధ్యాహ్నం నాటికి దేశవ్యాప్తంగా 4866 కరోనా కేసులు వచ్చాయంటే కరోనా వ్యాప్తి ఎంత వేగంగా జరుగుతోందో తేటతెల్లమవుతోంది. కేరళలో అత్యధికంగా 1487 యాక్టివ్‌కేసులు నమోదైనట్లు అధికారిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అదేవిధంగా, పశ్చిమబెంగాల్‌లో 538, మహారాష్ట్రలో 526, గుజరాత్‌లో 508, తమిళనాడులో 213, రాజస్థాన్‌లో 103, ఢిల్లీలో 62, ఆంధ్రప్రదేశ్‌లో 50 కేసుల వంతున నమోదయ్యాయి. అంతేకాదు, ఇప్పటికే 51 మంది ప్రాణాలు ఈ రాకాసి వ్యాధికి బలైపోయాయంటే కరోనా తీవ్రత అర్ధమవుతుంది. వాటిలో మహారాష్ట్రలో 17 మరణాలు సంభవించగా, కేరళలో 9, ఢిల్లీ 7, కర్నాటకలో 6, గుజరాత్‌లో 2 వంతున మృతిచెందినట్లు అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. కరోనా విజృంభణతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా అప్రమత్తమయ్యాయి. కరోనా ఇక రాదులే అనుకోకుండా, ముందుగా ప్రజలు ఎవరిపాటికి వారు జాగ్రత్తలు తీసుకోవడమే మేలు.

# 8న బాల గాంధర్వ గాన సభ



ప్రముఖ సంగీతజ్ఞుడు.. నెల్లూరు గానాలపట్టి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని ఈనెల 8న నెల్లూరు టౌన్‌హాలులో సాయంత్రం 6 గంటలకు రాగం-తానం-పల్లవి పేరుతో బాలగాంధర్వ గానసభ ఏర్పాటుచేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలూ పాడిన పాటలను ఆలపించి, పాటల దేవుడికి స్వరనీరాజనం అర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా డా. హైటెక్ రమణారెడ్డి, ప్రముఖ గాయకుడు పాటూరు శ్రీనివాసులు, జి.వి మురళిలకు ఆత్మీయ పురస్కారాలను ప్రదానం చేస్తామని తెలియజేశారు.

# ఒక మొక్క..మంచి స్నేహితుడితో సమానం

## వన మహోత్సవంలో ఎంపీ వేమిరెడ్డి

ఒక మొక్క..ఒక మంచి స్నేహితునితో సమానమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరు రూరల్‌లోని నగరవనంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30.5 శాతం మేర పచ్చదనం ఉందని, 2047 నాటికి దానిని కనీసం 50 శాతానికి పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి మొక్కలు నాటాలనే లక్ష్యంతో వనమహెూత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి పిలుపునిచ్చారని చెప్పారు. తాగే నీటి దగ్గరి నుంచి పీల్చే గాలి వరకు కాలుష్యం పెరిగిపోయిన నేపథ్యంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. చెట్లను నరకకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపడితే రాష్ట్రం క్లీన్ అండ్ గ్రీన్‌గా మారుతుందని చెప్పారు. అందుకే రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. పర్యావరణ సంరక్షణలో యువత కూడా భాగం కావాలన్నారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ కార్తీక్, డీఎఫ్‌వో మహ్మద్ బాషా, ఆర్డీవో అనూష, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నగర కార్పొరేషన్ కమిషనర్ నందన్‌తో కలసి ఆయన మొక్కలు నాటారు.



అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు కోటి మొక్కలు నాటడం గొప్ప విషయమని, జిల్లాలో అధికారులు 4.25 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారని అన్నారు. విద్యాసంస్థలు, వైద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండులు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ కార్తీక్, అటవీ శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం, వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు విద్యార్థినులకు బహుమతులిచ్చారు.





ఉత్తరక్రియలు

మా కుటుంబ కీర్తి, మా అభివృద్ధికి స్ఫూర్తి

**పెనుబోలు రాజగోపాలరెడ్డి గారు**

మాజీ డైరెక్టర్, కోరా విద్యాసంస్థలు

తేది. 28.05.2025 బుధవారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్ర ఆత్మ శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య : **పెనుబోలు ఇందిరమ్మ**

కుమారుడు - కోడలు

**పెనుబోలు మహేష్‌కుమార్‌రెడ్డి - దీప**

కుమార్తె - అల్లుడు

**సామంతు లక్ష్మీశిరీష - సామంతు శ్రీధర్‌రెడ్డి**

మనుమలు

**పెనుబోలు కునాల్‌రెడ్డి**

**పెనుబోలు మనోవిరాజ్‌రెడ్డి**

**సామంతు యోహిత్‌రెడ్డి**

మనుమరాళ్ళు

**శ్రావ్య - అమీత్, లాస్య**

మునిమనుమరాళ్ళు

**త్రిషిక, మిహిర**

మరియు **కుటుంబసభ్యులు**

**ఉత్తరక్రియలు** : వారి **పెద్దకర్మ తేది. 11.06.2025** బుధవారం ఉ.11.30 గంటలకు నెల్లూరు, దర్గామిట్టలోని మినర్వ గ్రాండ్ కన్వెన్షన్ -1 నందు జరుగును. కావున తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com